ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 23 నవంబరు 2024





గుంటూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న పెమ్మసాని

పత్తి కొనుగోలు వ్యాపారం కాదు

- పూర్తిగా కొనుగోలయ్యే వరకు కేంద్రాలు పని చేయాలి
- సీసీఐ సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు

6

వీరుల ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

- పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



వీరుల ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఊతమిస్తే.. ఉపాధి

8



- పతనావస్థలో ఉపాధి శిక్షణా కేంద్రాలు
- స్వయం ప్రతిపత్తి దశ నుంచి క్షీణ స్థితికి
- నాడు లక్షల్లో టర్నోవర్.. నేడు జీతాల కోసం వెతుకులాట
- కమీషన్ల కోసం కక్కుర్తి, సిండికేట్ జోక్యంతో పతనం
- దశాబ్ద కాలంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లన్నీ మూత
- తుప్పుపట్టిపోతున్న యంత్రాలు, సామగ్రి
- మహిళా ప్రాంగణానికి నాటి వైభవం వచ్చేనా?

రాష్ట్రంలోని రోడ్లకు రెండేళ్లలో కొత్తరూపు



అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

- గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు పక్కదారి
- అధ్వాన రహదార్లతో రాష్ట్ర ప్రగతికి విఘాతం
- సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లు
- ఆర్ అండ్ బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- మంగళగిరిలో ఎన్‌డీబీ రహదారుల పనులు పున:ప్రారంభం

8

సైనికుల ఊరు.. భావాజీపాలెం



- ఇంటికి ఇద్దరు, ముగ్గురు సైనికులు
- 1980లోనే ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ
- సరిహద్దుల్లో పనిచేయడం గర్వకారణమంటున్న సైనికులు

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకుల దుర్మరణం

తూములూరు నుంచి నంబూరు బైక్‌పై వెళుతుండగా ఢీకొన్న లారీ

6

నేల బావిలో స్నానానికి దిగి ఇద్దరు శివస్వాముల మృతి

- వినుకొండ మండలం నడిగడ్డలో విషాదం



మురుగునీటి శుద్ధి ప్లాంట్

- టెండర్ల దశలోనే మురుగు నీటిశుద్ధి ప్లాంట్లు
- రూ.151.33 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- స్థలాలు కేటాయించని మున్సిపల్ అధికారులు
- ప్రజారోగ్య పనులనూ పట్టించుకోని పురపాలకులు
- జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశాలు బేఖాతర్

నిధులున్నా.. నిర్లక్ష్యం

మురుగు.. మున్సిపాల్టీల్లో ప్రధాన సమస్యగా ఉంది. నీటిని, ఆహార పదార్థాలను, గాలిని కలుషితం చేసేస్తోంది. ప్రజల ఆరోగ్యాలను గుల్లచేస్తోంది. పట్టణాల్లో ఉత్పత్తి అయి పల్లెలను, పొలాలను పాడుచేస్తోంది. పర్యావరణానికి హానికరంగా ఉంటోంది. మురుగునీటితో సాగు వల్ల ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయి. ఇలాంటి మురుగును బాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. మున్సిపాల్టీల వారీగా ప్రత్యేకంగా నిధులు కేటాయించి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్‌టీపీ) నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్‌టీపీల నిర్మాణాలకు టెండర్లు పిలిచారు కానీ పనులు చేపట్టలేదు. మున్సిపాల్టీల్లో వీటి నిర్మాణానికి స్థలాలు చూపడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడటంలేదు. ఎస్‌టీపీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.151.33 కోట్లు నిధులు మంజూరు చేయగా.. స్థలాలు అప్పగిస్తే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నా పురపాలక సంఘాల్లో ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవనే చెప్పాలి. కూటమి ప్రభుత్వంలోనైనా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు పట్టాలు ఎక్కాలని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నిధులు మంజూరు ఇలా..

మున్సిపాల్టీ	కేటాయింపు (రూ.కోట్లలో)
వినుకొండ	18.60
పిడుగురాళ్ల	18.42
చిలకలూరిపేట	69.53
తెనాలి	31.50
బాపట	4.98
చీరాల	8.30

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) మురుగునీటి కాలుష్యాన్ని నివారించేందుకు మున్సిపల్ పట్టణాల్లో చేపట్టాల్సిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ల విషయంలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మురుగునీటిశుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు స్థలాల కేటాయింపు దశలోనే ఉన్నాయి. మున్సిపల్ పట్టణాల్లో నిత్యం ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు డ్రెయిన్ల ద్వారా శివార్లకు ప్రవహిస్తోంది. ఈ నీటి వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. మురుగు నీరు చెరువులు, వాగుల్లోకి చేరుతుండటంతో ఆ నీరు కూడా కలుషితం అవుతోంది. పంటల సాగుకు ఈ నీటిని వినియోగిస్తుండటంతో ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయి. నీటి కలుషితాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని రక్షించేందుకు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించాలని మున్సిపాల్టీలను జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశించింది. మున్సిపాల్టీల నుంచి ప్రతి రోజు వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసిన అనంతరమే ఆ నీటిని బయటకు విడుదల చేయాలని సూచించింది. అయితే ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఎస్టీపీల నిర్మాణం విషయంలో పుర పాలకులు సరైన రీతిలో స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. ఎస్టీపీలు ప్రతిపాదించిన ఏ ఒక్క మున్సిపాల్టీలో కూడా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. టెండర్లు నిర్వహించి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో..)

పనులు చేపట్టకుండానే..

ప్రజారోగ్యం దృష్ట్యా ఎస్‌టీపీలను వేగవంతంగా నిర్మించాల్సిన మున్సిపల్ అధికారులు పనులు చేపట్టకుండానే చేపట్టినట్టుగా జాతీయ హరిత న్యాయస్థానాన్ని మభ్యపెడుతున్నారు. ఎస్‌టీపీల నిర్మాణం విషయంతో జాతీయ హరిత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. టెండర్లు నిర్వహించి చేతులు దులుపుకున్న అధికారులు పనులు ప్రారంభించినట్లుగా ట్రిబ్యునల్‌ను మభ్య పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. హరిత న్యాయస్థానం ఓ కమిటీని నియమించి ఎస్‌టీపీల నిర్మాణంపై అధికారులు ఇస్తున్న నివేదికలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

సాగు ఎన్నికలకు.. రీషెడ్యూల్

- వచ్చే నెల 5న నోటిఫికేషన్ విడుదల
- 8న నీటి సంఘాలకు, 11న డీసీలకు ఓటింగ్
- 14న ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకునేలా ఉత్తర్వులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం శుక్రవారం రీషెడ్యూల్‌ను విడుదల చేసింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో 21న విడుదల చేయాల్సిన నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో వచ్చే నెల 5న ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. 8న సాగునీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ ఏర్పాట్లుచేస్తోంది. సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగునీటి సంఘాలు(డబ్ల్యుయూఏ) ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. దాదాపు 7 లక్షల మంది రైతులు ఓటర్లుగా నమోదు చేశారు. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. టీసీలకు 8న ఎన్నికలు నిర్వహించన్నారు. అదే రోజు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నికుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నికుంటారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి. వీటికి నోటిఫికేషన్‌ను 5న విడుదల చేయనున్నారు.

14న ప్రాజెక్టు కమిటీకి ఎన్నిక

సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీకి 14న ఎన్నికల నిర్వహించనున్నారు. 32 డీసీల అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికాలు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాల ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను అధికారులు కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి.



గుంటూరు బ్రాంచ్ కెనాల్

డిస్ట్రిబూటరీ కమిటీలు ఇవే..

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. డీసీలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. డీసీల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-12, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

7న బాపట్లకు సీఎం చంద్రబాబు

- రాష్ట్రస్థాయి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరు
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల 7న బాపట్లకు రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే మెగా పేరెంట్- టీచర్ మీటింగ్‌ను బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ఇప్పటికే జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చింది. సీఎంగా పగ్గాలు చేపట్టాక తొలిసారి జిల్లా కేంద్రం బాపట్లకు రానుండటంతో ఏర్పాట్లపై యంత్రాగాన్ని కలెక్టర్ వెంకటమురళి అప్రమత్తం చేశారు. గతంలో చేనేత దినోత్సవానికి జిల్లా పరిధిలోని చీరాలకు సీఎం చంద్రబాబు రావాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో అది రద్దయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వరదల సమయంలో కూడా సీఎం పర్యటన రెండు సార్లు ఖరారై వాతావరణం అనుకూలించక రద్దైంది. ఈ క్రమంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కోసం చంద్రబాబు బాపట్లకు రానుండడంతో ఆయన పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి బాపట్ల పర్యటన ఖరారైనట్లు కలెక్టర్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ కొరకు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని పోలీసు కవాతు మైదానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా మైదానాలను పరిశీలించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, ఆర్డీవో పి.గ్లోరియా, పీడీ కత్తి శ్రీనివాసరావు, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

- ఐదు స్కీముల కింద రూ.లక్ష చొప్పున..
- మూడు జిల్లాల్లోని 5,339 కేంద్రాలకు మహర్దశ
- తాగునీరు, మరుగుదొడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

అంగన్వాడీలకు.. నిధులు

నిధుల కేటాయింపు ఇలా..

మంచినీటి సదుపాయం	రూ.17,000
మరుగుదొడ్ల నిర్మాణం	రూ.36,000
మరమ్మతులు, రంగులు	రూ.19,800
పెరటి తోట నిర్వహణ	రూ.10,000
వర్షపు నీరు నిర్వహణ	రూ.16,000



గుంటూరులో అంగన్వాడీ మరుగుదొడ్డికి రంగులు వేస్తున్న కార్మికుడు



తెనాలిలో తుది దశకు చేరిన అంగన్వాడీ కేంద్రంలోని మరుగుదొడ్డి

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాగునీరు.. మరుగుదొడ్ల సౌకర్యం లేక.. భవనాలు రంగులు వెలసి.. అధ్వానంగా ఉండే అంగన్వాడీ కేంద్రాలు అద్భుతంగా మారనున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, పోషణ అందించే అంగన్‌వాడీ కేంద్రాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా మారాయి. వివిధ సమస్యలతో కునారిల్లిపోయిన అంగన్వాడీలకు గత ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. వాటి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఐదు రకాల స్కీముల కింద భారీగా నిధులు కేటాయించింది. ఆయా నిధులతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల తలరాత మారబోతోంది. మూడు జిల్లాల్లో మొత్తం 5,339 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా గత వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా అంగన్వాడీ కేంద్రాలు సమస్యల నిలయాలుగా మారిపోయాయి. కనీస అవసరాలైన మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం కూడా లేని కేంద్రాలు వందల సంఖ్యలో ఉన్నాయి. 2014- 19కి ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పెరటి తోటల పెంపకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పెరటి తోటలో మొక్కలు ఎండిపోయినా పట్టించుకోలేదు. చిన్నారుల ఆట వస్తువులు, బొమ్మలకు కూడా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విదిల్చలేదు. దీంతో అంగన్వాడీ కేంద్రాలు అధ్వానంగా తయారయ్యాయి. అవి కేవలం పిల్లలు, తల్లులకు పప్పుబెల్లాలు పంచిపెట్టే కేంద్రాలుగా మారాయి.

- **భారీగా నిధుల కేటాయింపు..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కేంద్రాల్లో పేరుకుపోయిన సమస్యలపై కదలిక వచ్చింది. అంగన్వాడీ కేంద్రాల్లోని సమస్యల పరిష్కారానికి భారీగా నిధులు కేటాయించింది. తక్షణ ప్రాతిపదికన అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేసింది.

ఆయా కేంద్రాల్లోని తాగునీటి, మరుగుదొడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిధులు విడుదల చేసింది. పెరటి పంటలకు 'పోషణ వాటిక' కింద నిధులు ఇచ్చింది. వర్షపు నీటి నిర్వహణ పేరుతో కూడా

(మిగతా 8వ పేజీలో..)

- సీఐలచే ప్రత్యేక బృందాల ఏర్పాటు
- అమ్మకాలు, ధరలపై ప్రత్యేకంగా పరిశీలన
- 20 బెల్టుషాపులపై కేసులు.. 15 మంది అరెస్టు
- ఆంధ్రజ్యోతి కథనంతో ఎక్సైజ్ అధికారుల్లో కదలిక
- బెల్టు షాపులపై ఉక్కుపాదం : డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్

ముమ్మరంగా ఎక్సైజ్ తనిఖీలు

తెనాలి క్రైం, గుంటూరు (కార్పొరేషన్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలు, మద్యం దుకాణాల్లో లూజు విక్రయాలు, ఎమ్మార్పీలపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శుక్రవారం సీఐల నేతృత్వంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో వాడవాడలా మద్యం అనే శీర్షికన ప్రచురితమైన ప్రత్యేక కథనంపై ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు స్పందించారు. గుంటూరు జిల్లాలో మొత్తం ఆరు బెల్టు షాపులపై కేసులు నమోదుచేసి ఆరుగురిని అరెస్టు చేశారు. 9.27 లీటర్ల మద్యాన్ని, 7.80 లీటర్ల బీరును సీజ్ చేశారు. చిలకలూరిపేట, పెదకూరపాడు, వినుకొండ, పిడుగురాళ్ల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఏడు బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. 10.80 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎల్ కేసు నమోదైంది. 8 బీర్ బాటిళ్లను కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేశారు. మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆరు సారా కేసులు నమోదు చేసి ఒకర్ని అరెస్టు చేశారు. రెండు లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వాడే ముడిపదార్థాలను ధ్వంసం చేశారు.

రంగంలోకి ప్రత్యేక నిఘా బృందాలు

మద్యం బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపినట్లు, ఇప్పటికే ప్రత్యేక నిఘా బృందాలు రంగంలోకి దిగాయని ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. తెనాలిలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఎక్సైజ్ పాలసీని పరిశీలించిన అనంతరమే ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్తమమైన మద్యం పాలసీని తీసుకు వచ్చిందన్నారు. నెల రోజుల్లో 235 కేసులు నమోదు చేశామని, మద్యం అక్రమ అమ్మకందారులు 215 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక వ్యక్తి వద్ద మూడు బాటిల్స్ కంటే మించి ఉండకూడదన్నారు. మద్యం అక్రమ అమ్మకాలు చేసినా, ప్రోత్సహించినా ఆ దుకాణదారుడికి రూ.5 లక్షల పెనాల్టీ విధిస్తామని తెలిపారు. రెండోసారి కేసు నమోదైతే షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. గతంలో మద్యం ధరల భారం ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం అందుబాటు ధరలు ఉండటంతో అమ్మకాలు పెరిగాయన్నారు. బెల్ట్‌షాపులపై తనిఖీలకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ వి.అరుణకుమారి, సీఐ యం.యశోధరదేవి, ఎస్ఐలు, ఫణికుమార్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

● బీసీ సంక్షేమశాఖ డీడీ మయూరి

గుంటూరు (విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్స్ పరీక్షకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.మయూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24లోగా గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్‌కు దరఖాస్తులు పంపాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన వారిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి విజయవాడకు శిక్షణకు పంపుతామని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం సంవత్సరానికి లక్షలోపు ఉండాలని, బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ కాపీలతో గుంటూరు రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని, ఇతర వివరాల కోసం 9959528410 సంప్రదించాలని సూచించారు.

27న డైట్‌లో సంప్రదాయ నృత్య పోటీలు

గుంటూరు (విద్య), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 27న యడ్లపాడు సమీపంలోని బోయపాలెం ప్రభుత్వ శిక్షణా సంస్థ(డైట్)లో జిల్లా స్థాయి బాలరంగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తప్పెటగుళ్ళు, కర్రసాము, చెంచులాట, దింసా, జాలరీ, బంజార అంశాలతో నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. నృత్య సమయం పది నిమిషాలు మించకూడదనీ, ఒక్కో బృందంలో 10 మంది విద్యార్థులు ఉండవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు డాక్టర్ కృష్ణప్రసాద్ డైట్ లెక్చరర్(8019207528)ను సంప్రదించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ప్రోత్సహించాలని జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు ప్రిన్సిపల్ చంద్రకళ విజ్ఞప్తి చేశారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తోపాటు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖలపై చర్చ జరుగుతుందని వెల్లడించారు.

గల్లంతైన బాలికల్లో యామిని మృతదేహం లభ్యం



ఈపూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో గురువారం గల్లంతైన ఇద్దరు బాలికల్లో పెద్ద పాప యామిని (10) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఉదయం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలిస్తుండగా కాలువలో పడిన దగ్గరలో మృతదేహం నీటిపైకి తేలింది. చిన్న పాప కావ్య(7) ఆచూకీ లభ్యం కాలేదు. సాయంత్రం వరకు కాలువలో గాలించారు. యామిని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు.

పత్తి కొనుగోలు అనేది వ్యాపారం కాదు

● రైతులను ఆదుకోవడానికి కేంద్రం ఏర్పాటు చేసిన బాధ్యత

● కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్షలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉత్పత్తి చేసిన పత్తిని సీసీఐ అధికారులు మార్చి నెల చివరి దాకా తప్పక కొనుగోలు చేయాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై సీసీఐ కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యం, రైతుల ఆందోళనపై సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యాలు, రైతులతో కేంద్ర మంత్రి పెమ్మసాని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ గత వారం రోజులుగా పత్తి కొనుగోలుపై సీసీఐ కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యం, అందుకు ఆందోళన వెలిబుచ్చుతున్న రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించే క్రమంలో ఈరోజు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తి కొనుగోలు అనేది వ్యాపారం కాదు, రైతులను ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన ఒక బాధ్యత అని తెలిపారు. ఉత్పత్తి అవుతున్న పత్తి పూర్తిగా కొనుగోలు అయ్యే వరకు సీసీఐ కేంద్రాలు పని చేయాలని సూచించారు. పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న పరిణామాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. రైతు తనంతట తానుగా దళారులకు అమ్మేలా చేసి, ఆ తర్వాత దళారులు ఆ పత్తిని సీసీఐకి విక్రయించేలా చేస్తున్నారని చెప్పారు. ఈ విధంగా వచ్చే మొత్తాన్ని పంచుకోవడానికే ఇలా జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా పత్తి అమ్మకంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

నాలుగు అంశాలపై సానుకూల స్పందన

అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమీక్షలో ముఖ్యంగా నాలుగు అంశాలపై సీసీఐ అధికారులు సానుకూలంగా స్పందించి అందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారన్నారు. 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద 61 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. అందుకు సానుకూలంగా అధికారులు స్పందించారు. ప్రస్తుతం సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి, శనివారం కూడా కొనుగోళ్లు జరపాలని సీసీఐ అధికారులను కోరగా అందుకు వారు అంగీకరించారని తెలిపారు. పత్తి అమ్మకానికి సంబంధించి డాక్యుమెంటేషన్‌కు వేలిముద్రలు వేయడానికి సాయంత్రం 6 గంటల వరకే వెసులుబాటు ఉండటంతో రైతులకు ఇబ్బందికరంగా ఉందనీ, ఈ సమయాన్ని రాత్రి 7:30 గంటల వరకు పొడిగించేలా చూడాలని సీసీఐ అధికారులకు స్పష్టం చేయగా, అందుకు వారు ఒప్పుకున్నారన్నారు. పత్తి బోరాలు తెచ్చే విధానం, లోడింగ్ చేసే పద్ధతి, వాతావరణం పలు అంశాలలో ఉన్న తేడాల వలన తేమ పరీక్షల్లో విభిన్న ఫలితాలు తలెత్తుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయం చేసుకుని రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ ఛైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జిల్లా రెవెన్యూ అధికారి షేక్. ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, సీసీఐ డైరెక్టర్ మార్కెటింగ్ విజయ్ కురదాగి, మార్కెటింగ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రాజబాబు, గుంటూరు మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి, జిన్నింగ్ మిల్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మాతృమూర్తిని మానవత్వం ఆదుకుంది

● అమ్మను రోడ్డుపై వదిలి వెళ్లిన పిల్లలు

● చలికి వణికిపోయిన తల్లి

● సబ్‌కలెక్టర్ ఆదేశాలతో నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థకు తరలింపు



వృద్ధురాలిని పరిశీలిస్తున్న నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి భారమైందనుకున్నారేమో ఆ కుమారులు.. బాల్యంలో మలమూత్రాలు శుభ్రం చేసి స్నానం చేయించి లాలిపాటలతో గోరుముద్దలు తినిపించిన ఆ చేయి వృద్ధాప్యంలో భారంగా మారిందనుకున్నారో ఏమో.. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న బిడ్డలే నడిరోడ్డుపై వదిలేసి వెళ్తుంటే ఆ తల్లి ఎంత తల్లడిల్లి ఉంటుందో.. తెనాలిలో శుక్రవారం వెలుగుచూసిన ఓ వృద్ధురాలి ఉదంతం ఇది. తెనాలి నాలుగు వరుసల రోడ్డులో మార్కెట్ వంతెన వద్ద ఫుట్‌పాత్‌పై సరైన వస్త్రాలు లేక చలికి గజగజా వణుకుతూ అల్లాడిపోతున్న 92 ఏళ్ల వృద్ధురాలిని హెల్పింగ్ సోల్జర్స్ టీం సభ్యులు గుర్తించారు. సరైన ఆహారం తీసుకోక నీరసించి అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలి బాధను చూడలేక మంచినీరు, ఆహారం అందించారు. దుస్తులు కప్పి పక్కనే ఉన్న బస్‌షెల్టర్‌లో ఉంచి చలికి తట్టుకునేలా కోటు ఇచ్చారు. ఆమె కొంత కోలుకునేలా సపర్యలు చేశారు. వృద్ధురాలి పేరు అంజమ్మ అని తనది తెనాలిలోని చెంచుపేట అని చెప్పింది. తమ పిల్లలే తనను ఆటోలో తీసుకువచ్చి గురువారం రాత్రి ఇక్కడ వదిలేసి వెళ్లిపోయారని కన్నీటి పర్యంతమైంది. ఇంటి అడ్రస్, ఇతర వివరాలు చెప్పేందుకు ఆమె ఇష్టపడటంలేదు. ప్రస్తుతం ఆమె నడిచే స్థితిలో కూడా లేదు. వృద్ధురాలి బాధను స్థానిక అధికారులకు, మీడియా దృష్టికి హెల్పింగ్ సోల్జర్స్ టీం సభ్యులు తీసుకు వెళ్లారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ సంజన సిన్హా తహసీల్దార్ గోపాలకృష్ణను, మున్సిపల్ అధికారులను ఆమె సంరక్షణ చర్యలపై ఆదేశించారు. దీంతో గుంటూరుకు చెందిన నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి వృద్ధురాలి సంరక్షణాబాధ్యతలను వారికి అప్పగించారు. వృద్ధురాలి పట్ల మానవత్వం చాటిన హెల్పింగ్ సోల్జర్స్ ప్రతినిధులను తహసీల్దార్ గోపాలకృష్ణ, పలువురు అధికారులు, మానవతావాదులు అభినందించారు. వృద్ధురాలిని రోడ్డుపై విడిచివెళ్లిన కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నామని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు.

చోరీ కేసుల్లో తొమ్మిది మంది అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 18 మోటార్ సైకిళ్లు, 170 గ్రాముల బంగారం, నాలుగు కిలోలు వెండి, పదివేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి 6 కేసుల్లో నిందితుడైన షేక్ సుభానిని అరెస్టు చేసి 170 గ్రాములు బంగారం, నాలుగు కిలోల వెండి, పదివేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. సుభాని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో చోరీలకు పాల్పడ్డాడు. అయినవోలు పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఎనిమిది మోటార్ సైకిళ్లను చోరీ చేసిన లింగం యలమంద, కొమ్మిరి శెట్టి రామాంజనేయులులను అరెస్టు చేశారు. ఈపూర్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి కొండ్రముట్ల గ్రామ సచివాలయంలో చోరీకి పాల్పడిన జరపాల వెంకటేశ్వర్ నాయక్, భూక్య బాలాజీ నాయక్, పొడివలస గణపతులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 4 లక్షలు విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి పది మోటార్ సైకిళ్లను చోరీ చేసిన మట్టపల్లి హరిబాబు, చల్లా భవాని శంకర్, షేక్ మస్తాన్‌వలిలను అరెస్టు చేశారు. కేసుల దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన అధికారులను ప్రశంసించారు. వారికి రివార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకు పోలీస్ వ్యవస్థ

ప్రజల చెంతకు పోలీస్ వ్యవస్థను తీసుకువెళ్లటానికి పోలీస్ సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి త్వరలో 'మీతో మేము' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

ప్యాసింజర్ రైళ్ల నంబర్లు మార్పు

● జనవరి 1వ తేదీ నుంచి అమలు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లగా నడుపుతున్న రైల్వే శాఖ వాటి నంబర్లను జనవరి 1వ తేదీ నుంచి మార్పు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రస్తుత నంబరు	రైలు	కొత్త నంబరు
07464	విజయవాడ-గుంటూరు	67769
07465	గుంటూరు - విజయవాడ	67770
07277	మిర్యాలగూడ - నడికుడి	67777
07973	నడికుడి - మిర్యాలగూడ	67778
07974	మిర్యాలగూడ - కాచీగూడ	67776
07791	కాచీగూడ - నడికుడి	67779
07792	నడికుడి - కాచీగూడ	67780
07279	విజయవాడ - తెనాలి	67213
07575	తెనాలి - విజయవాడ	67214
07786	గుంటూరు - రేపల్లె	67223
07787	రేపల్లె - గుంటూరు	67234
07889	రేపల్లె - మార్కాపురం రోడ్డు	67238
07282	తెనాలి - గుంటూరు	67236
07628	విజయవాడ - గుంటూరు	67229
07629	విజయవాడ - తెనాలి	67221
07630	తెనాలి - విజయవాడ	67222
07781	విజయవాడ - మాచర్ల	67227
07782	మాచర్ల - విజయవాడ	67228
07864	గుంటూరు - విజయవాడ	67230
07873	రేపల్లె - తెనాలి	67224
07874	తెనాలి - రేపల్లె	67231
07875	రేపల్లె - తెనాలి	67232
07876	తెనాలి - రేపల్లె	67233
07887	గుంటూరు - తెనాలి	67235
07888	తెనాలి - రేపల్లె	67237
07890	మార్కాపురం రోడ్డు - తెనాలి	67239
07281	నరసపూర్ - గుంటూరు	67247
07784	గుంటూరు - రేపల్లె	67249
07785	రేపల్లె - గుంటూరు	67250
07976	గుంటూరు - విజయవాడ	67248
07783	విజయవాడ - గుంటూరు	57201
07788	గుంటూరు - విజయవాడ	57202
07579	నడికుడి - మాచర్ల	57205
07580	మాచర్ల - నడికుడి	57206
07779	గుంటూరు - మాచర్ల	57203
07780	మాచర్ల - గుంటూరు	57204


రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి (50), భార్య సురేఖ, కుమారుడు హరినాథ్‌రెడ్డి (19) కలిసి ద్విచక్రవాహనంపై నంబూరు వెళ్తున్నారు. ఇదే క్రమంలో హాఫ్‌పేట - ఖాజీపేట మధ్యలో ఎదురుగా వస్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తండ్రి, కొడుకులు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా సురేఖకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా హరినాథ్‌రెడ్డి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రవీంద్రారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్సపొందుతూ రవీంద్రారెడ్డి కూడా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త, కుమారుడిని కోల్పోయిన సురేఖ రోధిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. హరినాథ్‌రెడ్డి ఐటీఐ చదువుతుండగా నంబూరులో స్థిరపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.


బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

దాచేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దాచేపల్లి నాగులేరు బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. శుక్రవారం నారాయణపురం గ్రామానికి చెందిన బండ్ల మహేష్(18) ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తూ దాచేపల్లి నుంచి నారాయణపురం వస్తున్నాడు. ఈ క్రమంలో బస్సును స్వల్పంగా ఢీకొట్టగా బండి అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌కు తగిలింది. బండి పైనుంచి కిందపడిన యువకుడి తలకు బలమైన గాయాలయ్యాయి. మృతునికి వివాహం కాలేదు. కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దాచేపల్లి ఎస్ఐ సౌందర్‌రాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో స్నానం చేస్తూ ఇద్దరు శివస్వాములు మృతి



రామకృష్ణ(ఫైల్)



మల్లికార్జున (ఫైల్)

వినుకొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు శివమాలధారణ యువకులు మృతి చెందిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని నాగార్జునసాగర్ కాల్వ వద్ద గల ఆరోక్య అరుణ్ పంట పొలంలోని నేల బావిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఒంటేరు రాంబాబు చేసిన పడిపూజ కార్యక్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాలధారణ స్వాములు అందరూ బిజీబిజీగా గడిపారు. సద్ది అనంతరం మిగిలిన పనులు పూర్తి చేద్దామని శివమాల ధరించిన కామస్వామి రామకృష్ణ (27), జెట్టి మల్లికార్జున(22) స్నానానికని నేలబావి వద్దకు వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ బావిలో మృతి చెందారు. ఆ సమయంలో అక్కడ ఉన్న నాగరాజు, నరసింహారావు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు బావి వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వినుకొండ పట్టణ సీఐ శోభన బాబు, తహసీల్దార్ సురేష్ నాయక్, ఫైర్ అధికారి నాగేశ్వరరావు సిబ్బందితో బావి వద్దకు చేరుకున్నారు. సుమారు 30 అడుగల లోతులో ఉన్న నీటిని 6 ట్రాక్టర్ల సహాయంతోపాటు ఫైర్ అధికారులు తమ వద్ద ఉన్న యంత్రాలతో రాత్రి 8 గంటల వరకు నీటిని తోడి మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. మృతుడు రామకృష్ణకు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఒక కుమార్తె ఉంది. ఇరువురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీఐ శోభనబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమాఖ్య కార్యాలయాన్ని చుట్టుముట్టిన మహిళలు



వినతి పత్రం అందజేస్తున్న బాధిత మహిళలు

అమరావతి, నవంబరు 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని అత్తలూరు, ధరణికోట గ్రామాల్లోని మహిళా సంఘాల్లో రూ.55 లక్షలు గోల్‌మాల్ అయ్యాయని, తమకు న్యాయం చేయాలని సంబంధిత సంఘాల సభ్యులు శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయాన్ని చుట్టుముట్టి మండల సమాఖ్యకు వినతి పత్రం అందజేశారు. ధరణికోట గ్రామంలో 185 మహిళా సంఘాలు ఉండగా ఆరుగురు యానిమేటర్‌లు ఉన్నారు. అత్తలూరు గ్రామంలో 100 మహిళా సంఘాలు ఉండగా ముగ్గురు యానిమేటర్‌లు ఉన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న స్త్రీనిధి రుణాలు చెల్లించి మళ్లీ రుణాలు పొందేందుకు మండల సమాఖ్య వద్దకు వెళ్లగా వారు తీసుకున్న రుణాలు చెల్లించనట్లు ఉంది. దీంతో సభ్యులు ఆందోళన చెంది తాము రుణాలు చెల్లించినప్పటికీ తమ పేరు మీద అప్పులు ఉండటం ఏమిటని మహిళలంతా మండల సమాఖ్య అధ్యక్షురాలు చింకా నాగలక్ష్మికి వినతి పత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపి బాధిత మహిళలకు న్యాయం చేస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని నాగలక్ష్మి తెలిపారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం

(5 పేజీ తరువాయి)

ఎస్‌టీపీల నిర్మాణాన్ని గాలికొదిలేసింది. జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్ మొట్టికాయలు వేసినా గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. మున్సిపాలిటీలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు స్థలాలను కేటాయించలేదు. పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఎస్‌టీపీల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్యం దృష్ట్యా ఎస్‌టీపీల పనులు వేగవంతంగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు గుర్తించాలి. స్థలాలను కేటాయించి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి.

తెనాలిలోనే పనులు..

గుంటూరు జిల్లాలో ఒకటి, పల్నాడు జిల్లాలో మూడు, బాపట్ల జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులు విడుదల చేసింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో అమృత్ పథకానికి ఈ ఎస్‌టీపీలను అనుసంధానం చేశారు. అయితే మూడు జిల్లాల్లో ఆరు మున్సిపాలిటీలకు ఒక్క గుంటూరు జిల్లా తెనాలిలో మాత్రమే మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. తెనాలిలో అమృత్ పథకం కింద రూ.31.50 కోట్లతో పనులు చేస్తున్నారు. వినుకొండ మున్సిపాల్టీలో ముట్లకుంటకాలనీ ప్రాంతంలో 5.70 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ స్థలంలో కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. వినుకొండలో చెక్కవాగు నిర్మల స్కూల్ ప్రాంతంలో 5.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మరో ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. వీటికి రూ.18.60 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పిడుగురాళ్లలో రూ.18.42 కోట్లతో 5.90 ఎంఎల్‌డీ సామర్థ్యంతో హనుమందిర్ రోడ్డులో, 5.20 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్సీ శ్మశానవాటిక సమీపంలో మరో ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో ప్లాంట్ల నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. ఈ రెండు మున్సిపాల్టీలలో నాలుగు ఎస్‌టీపీల నిర్మాణ పనులు టెండర్‌ను శ్రీకృష్ణ ఎస్వీరో ఇంజనీర్స్ విజయవాడ సంస్థ దక్కించుకుంది. చిలకలూరిపేట మున్సిపాల్టీలో అమృత్ పథకంలో భాగంగా రూ.69.53 కోట్లతో చేపట్టిన ఎస్‌టీపీ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. బాపట్ల జిల్లా బాపట్ల మున్సిపాల్టీలో రూ.4.98 కోట్లతో 3 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఎస్‌టీపీని కంపోస్టు యార్డు ప్రాంతంలో నిర్మించాలి. ఇందుకు సంబంధించి స్థలం కేటాయింపు జరగలేదు. చీరాల మున్సిపాల్టీలో రూ.8.30 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఐకేనగర్ దండుబాట ప్రాంతంలో నిర్మించాలని స్థలాన్ని గుర్తించారు. అయితే స్థల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయింది. ఈ రెండు మున్సిపాల్టీలలో ఎస్‌టీపీల టెండర్‌ను సింగన్ ప్రాజెక్టు లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ దక్కించుకుంది.

వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

● జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో నిర్వహించనున్న వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వీరుల దేవాలయంలో జరుగుతున్న ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పల్నాటి చరిత్రను పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వీరులు ఉపయోగించిన ఆయుధాలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

45,111 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,839 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,111 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 29,101 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500	334	8000	13000
నెంబరు. 5	8000	14000	నెంబరు. 5	11000	13000
273	10000	13000	273	8500	12200
341	8000	15500	341	8000	15000
4884	-	-	4884	9000	14000
సూపర్ 10	-	-	సూపర్ 10	9000	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	8000	16500
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	7500	12500
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	9500	13500
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	4500	11000

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీనగర్, తారకరామనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. నవభారత్‌నగర్ ఒకటి, రెండు, నాలుగో లైను, సిద్ధార్థనగర్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. డీ3 సెక్షన్ పరిధిలోని రామిరెడ్డితోట, ప్రకాష్‌నగర్, గణేశ్వరరావుపేట, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, గుంటూరువారితోట, డీ10 సెక్షన్ పరిధిలోని పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్ మరో ప్రకటనలో తెలిపారు.విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పింఛన్లలోనూ కారుణ్య విధానం

గుంటూరు సిటీ, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పంపిణీ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. పింఛన్ల లోనూ కారుణ్య విధానం ప్రవేశ పెట్టింది. గతంలో పెన్షన్ దారుడు మరణిస్తే భార్యకు పెన్షన్ మంజూరు చేసే అవకాశం లేదు. కొత్త పెన్షన్ కోసం భార్య నానా కష్టాలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. పెన్షన్ దారుడైన భర్త మరణిస్తే,ఆ పెన్షన్‌ను భార్యకు బదలాయిస్తారు. భర్త చనిపోయిన 15 రోజుల లోపే పెన్షన్ బద లాయింపు జరుగుతుంది. మరణ ధ్రువీకరణపత్రం, ఇతర వివరాలు గ్రామ, వార్డు సచి వాలయంలో అందజేస్తే పక్షం రోజుల్లోనే పెన్షన్‌ను భార్యకు బదలాయిస్తారు.

ఏడేళ్ల బాలికపై బీటెక్ విద్యార్థి అఘాయిత్యం

● పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ప్రాంతానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై బీటెక్ విద్యార్థి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆటో డ్రైవర్ దంపతులకు ఇరువురు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం ఉన్నారు. కొంతకాలంగా వారు ఓ ఇంట్లో మొదటి అంతస్తులో అద్దె కుంటున్నారు. పక్కిల్లు ఇంటి యజమాని బంధువులకు సంబంధించింది. పక్కింటికి చెందిన బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి భోగ్యం నవీన్ (20) ప్రతిరోజు ఆ బాలిక ఉంటున్న ఇంటిపై అంతస్తులోకి వచ్చి మోటర్ వేయడం, ఇంటి పైన తిరగడం చేస్తుంటాడు. ఇది ఇలా ఉండగా శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తల్లి దండ్రులు ఇంట్లో ఉండగా బయట వరండాలో పిల్లలు హోంవర్క్ రాసు కుంటున్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన నవీన్ యూకేజీ చదువుతున్న ఆ బాలికను కిందికి తీసుకెళ్లాడు. కింది పోర్షన్‌లో ఉండే బంధువులు తిరుపతి వెళ్లడంతో ఆ ఇంట్లోకి తీసుకెళ్లి బాలికపై అఘాయిత్యం చేశాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో తల్లిదండ్రులు అక్కడికి రావడంతో ఈ విషయాన్ని బాలిక చెప్పింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట ప్రాంతంలో బాలికకు మాయమాటలు చెప్పి తీసుకువచ్చి పెళ్లి చేసుకొని వేధించిన ఘటనపై పోలీ సులు పోక్సో కేసు నమోదు చేశారు. నకరికల్లు మండలం గుండ్లపాడుకు చెందిన ఓ బాలికను పెదకూర పాడు మం డలం లగడపాడుకు చెందిన 31 సంవత్సరాల యువకుడు మాయమాటలు చెప్పి తీసుకువచ్చి పెళ్లి చేసుకున్నాడు. అయితే, ఆ యువకుడికి గతంలోనే వివాహం కావడం, భార్యాభర్తలు విడిపోవడం జరిగింది. బాలికను పెళ్లి చేసుకుని చుట్టుగుంట ప్రాంతంలో కొంత కాలంగా కాపురం ఉన్నాడు. అయితే, ఇటీవల బాలికను వేధించి, తనకొద్దని బెదిరించడంతో ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

వివాహిత యువతి మృతి

ఈ నెల 11న మనస్తాపంతో ఎలుకల మందు తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్న దేరంగుల సుధా రాణి (26) జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. అరండల్ పేట పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ ప్రాంతానికి చెందిన వివాహిత సుధారాణికి, భర్త ఏడు కొండ లుకు మధ్యమనస్పర్థలు రావడంతో కొంత కాలంగా ఆమె నాయుడుపేట ఒకటో లైన్‌లో గది అద్దెకు తీసుకుని ఉంటోంది. ఇళ్లల్లో పాచి పనులు చేసుకొని జీవనం సాగిస్తోంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త, పిల్లలకు దూరంగా ఉం టోంది. దీంతో, మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 11న ఆత్మహత్యయత్నా నికి పాల్పడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జీజీ హెచ్‌కు తరలించారు అప్పటినుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. సుధారాణి దూరపు బంధువు కోటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి వివాదంపై వేర్వేరు ఘటనల్లో దాడులు

ఆస్తి వివాదాల నేపథ్యంలో రెండు వేర్వేరు ఘటనల్లో దాడికి పాల్పడటంపై కేసులు నమోదయ్యాయి. ఓ ఘటనలో కొరిటెపాడు ఆంజనేయపేటకు చెందిన షేక్ ఆంజనేయులు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఆయనపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు ఎల్ఐసీ ఏజెంట్ షేక్ వలి, మస్తాన్ బీ, రాజమౌళి తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో .. ఇంటి వివాదం నేపథ్యంలో శ్రీనగర్ ఐదో లైనుకు చెందిన మచ్చ శివ భాగ్యలక్ష్మి పై మచ్చ పద్మ ,లింగంపల్లి అశోక్, స్వప్న, సంధ్య, దుర్గమ్మ, వెంకటమ్మ, నరసింహారావు దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మూకలకు గుణపాఠం చెప్పండి

● పోలీసులకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు
● బృందావన్‌గార్డెన్స్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్- ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌లో పరిశీలన ● గంజాయి మూకలపై వైద్యుల ఫిర్యాదు


ఆసుపత్రి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి పెమ్మసాని, పక్కన కలెక్టర్ నాగలక్ష్మి, ఉండవల్లి శ్రీదేవి

గుంటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గంజాయి మూకలకు తగిన గుణపాఠం చెప్పాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ పోలీసులను ఆదేశించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్- ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలోని డ్రెస్సింగ్ అండ్ ఎమర్జెన్సీ రూమ్, ఫార్మసీ, మెటర్నిటీ, పురుషుల విభాగం, అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రాత్రి వేళల్లో పలువురు గంజాయి సేవించిన అగంతకులు ఆసుపత్రి ప్రాంగణంలోకి వస్తున్నారని, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రాత్రి వేళల్లో భద్రత లేని పరిస్థితి నెలకొందని మంత్రికి వైద్యులు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి ప్రహరీగోడ నిర్మాణం పెండింగ్‌లో ఉందని ఆయన దృష్టికి తెచ్చారు. మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ మరోసారి గంజాయి బ్యాచ్ ఆసుపత్రి పరిసరాల్లో కనిపించ కుండా చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రహరీ గోడ మంజూరైనా నిర్మాణం చేపట్టని కాంట్రాక్టర్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే దాని నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. జీజీ హెచ్‌పై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోందని, బాధితులు హెల్త్ సెంటర్లకు వెళ్ల కుండా నేరుగా జీజీహెచ్‌కు రావడం వల్లే ఒత్తిడి పెరుగు తోందని చెప్పారు. ఆసు పత్రిలో అన్ని సదుపాయాలు వున్నాయని, వారానికి ఒక సారి స్పెషలిస్టులు, సూప రింటెండెంట్, పీడియాట్రిషన్, జనరల్ మెడిసిన్ తదితర వైద్యులు ఇక్కడికి వచ్చి విధులు నిర్వహిస్తే రోగులకు అందుబాటులో ఉండవచ్చని తెలిపారు. సాధారణ జ్వరాలు, ఆరోగ్య సమ స్యలపై హెల్త్ సెంటర్‌కు వచ్చేలా ఒక క్రమ పద్ధతిని అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ సంద ర్భంగా పీహెచ్‌సీ సమీపంలో ఉన్న రైతు బజారును కూడా పెమ్మసాని పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, టీడీపీ నేత తాళ్ల వెంకటేశ్ యాదవ్‌పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరగాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు


విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో సత్వర న్యాయం జరగాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా కేసుల్లో నిర్దేశిత మార్గ దర్శకాల ప్రకారం సక్రమంగా విచారించాలని, పోలీస్, రెవెన్యూ, సంబం ధిత శాఖల అధికారులు సమ న్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులలో మూడు నెలలు దాటినవి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణకు సంబంధించి అడ్డంకులను సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ పరిష్కారదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేర సంఘటనలపై నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బాధితులకు సక్రమంగా పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సఫాయి కర్మచారుల సంక్షేమానికి, స్వయం ఉపాధి పథకాలపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించడంతో పాటు బ్యాంకు ద్వారా ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీకి అన్ అఫిషియల్ మెంబర్ల నియామకం త్వరలోనే జరుగుతుందని, నెల తర్వాత మరోసారి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణ మూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు మధుసూదనరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మురళీధర్, జిల్లాఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ మల్లికార్జునరావు, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనరు సుభాని, తెనాలి మున్సిపల్ కమిషనర్ శేషన్న, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మొబిన, నగరపాలక సంస్థ సీఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు.

జగన్ అవినీతి బాగోతం ఖండాంతరాలకు!: ఎమ్మెల్యే మాధవి


ఫైనాన్షియల్ కమిటీ సభ్యుల ఎన్నిక సందర్భంగా అసెంబ్లీలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రలు, దేశాలు దాటి జగన్‌రెడ్డి అవినీతి బాగోతం ఖండాతరాలు చేరిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి విమ ర్శించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం శుక్రవారం ఆమె విలేకరులతో మాటాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు హైదరాబాదును ప్రపంచ పటంలో పెడితే, తెలుగు వారి గౌరవాన్ని అంతర్జాతీయంగా కోర్టు బోనులో నిలబెట్టబోతున్న ఘనత జగన్‌రెడ్డిదేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా చంద్ర బాబు కుటుంబాన్ని దూషించిన సంస్కార హీనుడు జగన్ అని, అలా దూషించడానికి ఆయ నకు ఉన్న అర్హత ఏమిటో తెలుసుకుని మాట్లాడితే ప్రజలు హర్షిస్తారని అన్నారు. జగన్ ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రాన్ని దోచుకొని తిన్నారనేందుకు అమెరికా ప్రభుత్వం జగన్ రెడ్డిపై మోపిన భారీ ముడుపుల అభియోగమే సాక్ష్యమని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై మాట్లాడమంటే, ప్యాలెస్‌లో కూర్చుని తన ఇష్టానుసారం జగన్ నోరు పారేసు కోవడం మంచిది కాదని అన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఫైనాన్షియల్ కమిటీలకు సభ్యులను ఎన్నుకునేందుకు రాష్ట్ర శాసనసభ కమిటీ హాల్లో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తాడిశెట్టి తనయుడి వివాహం.. సీఎంకు ఆహ్వానం


సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న తాడిశెట్టి మురళీ, కుటుంబ సభ్యులు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ నేత తాడిశెట్టి మురళీ మోహన్ తనయుడు వెంకట ఉత్తేజ్, వధువు ఎష్లతో డిసెంబరు 14న వివాహం జరగనుంది. ఈ సందర్భంగా ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబును శుక్రవారం తాడిశెట్టి మురళీమోహన్, భార్య అమల, కుటుంబసభ్యులు కలిసి శుభలేఖను అందజేశారు. హర్యానాలోని గురు గ్రామ్‌లో వివాహానికి, డిసెంబర్ 21న గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో రిసెప్షన్‌కు రావాలని ఆహ్వానించారు. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి శుభలేఖ అందజేశారు.

సినీ నటుడు మోహన్‌బాబుకు తాడిశెట్టి వెంకటరావు అభినందనలు

గుంటూరు, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబు సినీ రంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావు, ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి హైదరాబాద్‌లో ఆయనకు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు. వైవిధ్యభరితమైన చిత్రాలతో మోహన్‌బాబు తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేశారని అన్నారు.

బాలకుటీర్‌లో ఆకట్టుకున్న సైన్స్ అండ్ ఆర్ట్స్ ప్రదర్శన

గుంటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొంది స్తాయని డాక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్‌లో సైన్స్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. బాలకుటీర్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్ మంగాదేవి,సీఏవో దుర్గారఘురామ్ పాల్గొన్నారు.

ఘనంగా శారదానికేతన్ వార్షికోత్సవం

గుంటూరు(విద్య),నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శారదానికేతన్ 102వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.. బాలికా విద్యకోసం శారదనికేతన్ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సిహెచ్ సుబ్రహ్మణ్యేశ్వరి, వేదవతి తదితరులకు ఉన్నవ లక్ష్మీబాయమ్మ జీవిత సాఫల్యపురస్కారం అందజేశారు.

రైల్వేలోని అన్ని విభాగాల్లో 'హిందీ'ని వినియోగించాలి

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): రైల్వేలోని అన్ని విభాగాల్లో హిందీ అధికార భాషని విని యోగిం చాలని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ ఆదేశించారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవ న్‌లో శుక్రవారం సాయంత్రం టౌన్ అధికార భాష అమలు కమిటీ సమావేశం జరిగింది.

లివర్, జీర్ణకోశ వ్యాధులపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): లివర్, జీర్ణకోశ వ్యాధులపై ఆదివారం ఉదయం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ నిర్వహించ నున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ట్రో ఎంటరాల జిస్టు డాక్టర్ సిద్ధార్థరెడ్డి ఆళ్ళ ప్రధాన వక్తగా హాజరై ఆయా వ్యాధులపై జాగ్రత్తలు, అవ గాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

● డ్రెయిన్ల నిర్మాణపు పనులు నెలాఖరుకి పూర్తి చేయాలి
● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు


ఏటీ అగ్రహారం రోడ్డు మ్యాప్ ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని విస్తరణ పనులు జరుగుతున్న ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డులోని డ్రెయిన్ల నిర్మాణాలు ఈ నెలాఖరుకి పూర్తి చేయాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనులను చుట్టు గుంట నుండి కంకరగుంట ఆర్‌యూబీ వరకు శుక్రవారం పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో, కాంట్రాక్టర్లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కోర్టు కేసులు, సమస్యలు లేని ప్రాంతంలో కూడా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కోర్టు కేసుల సాకుతో విస్తరణ పనుల్లో జాప్యం సహించ బోమని, కేసులు వేసిన వారిని అవసరమైతే నేరుగా తమ దగ్గరకు తీసుకువస్తే వారి సమస్యలు, చట్ట ప్రకారం పరిష్కారంపై తగిన అవగాహన కల్గిస్తామన్నారు. సమస్యలు లేని ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణ పనులు కూడా తక్షణం ప్రారంభించాలన్నారు. విద్యుత్ స్తంభాల షిఫ్ట్ కి డీడీలు చెల్లించినప్పటికీ ఆ పనులు చేయకపోవడంపై సీపీడీసీఎల్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ మధు సూదన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు, రేపు నగరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గుంటూరు నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలలో స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా స్పెషల్ క్యాంపెయిన్ డే జరుగుతుందని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం మార్గ దర్శకాలకు అనుగుణంగా నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో శని,ఆదివారాల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ క్యాంపెయిన్ డేస్ జరుగుతాయని, బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండే వారు, ఇప్పటి వరకు ఓటు లేని వారు నూతన ఓటు కోసం ఫారం-6, ఓటర్ లిస్టు పై అభ్యంతరాలను ఫారం-7, ఓటు వివరాలు తప్పుగా నమోదైన వారు ఫారం-8(కరెక్షన్) ఫారాలను బీఎల్ఓలకు అందించవచ్చని తెలిపారు.


అనుగ్రహ భాషణం చేస్తున్న విధుశేఖర భారతీ స్వామి, హాజరైన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తదితరులు

సన్మార్గంలో ప్రయాణిస్తే జీవితానికి సార్థకత

● విధుశేకర భారతీ స్వామి అనుగ్రహ భాషణం

గుంటూరు(తూర్పు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సన్మార్గంలో ప్రయాణిస్తే మనిషి జీవితానికి సార్థకత లభిస్తుందని శ్రీశృంగేరీ శారదా పీఠం 37వ జగద్గురువులు విధుశేఖర భారతీ మహాస్వామి తెలిపారు. నగరంలో విధు శేఖర భారతి మహాస్వామి వారి విజయ యాత్ర మహోత్సవం రెండవ రోజుకి చేరింది. ఇందులో భాగంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం గురువందనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విధుశేఖర భారతీస్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. అన్నీ తనకు అనుకూలంగా ఉండాలనుకుంటున్న ఆశా జీవి మనిషి, స్వార్థంతో వ్యవహరిస్తున్నాడని, అయితే ధర్మం ఏది ఇవ్వాలో దానినే అందిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ భగవంతుని ఆరాధన, పరోపకారం ఈ రెండు విషయాలను అలవర్చుకోవాలని, వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయని అన్నారు. భగవంతుని ఆరాధన చేసే శక్తి లేకపోతే నామస్మరణ చేయాలని, సాక్షాత్తు భగవంతుడు చెప్పిన భగవద్గీత పఠనం అలవరుచుకోవాలని, ముఖ్యంగా యువత గీత పఠనం చేయాలని, అప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని సూచించారు. హిందూ హితాన్ని శ్రేయస్సుని అభివృద్ధిని కోరి మార్గదర్శకం చేసే వ్యక్తులు అరుదుగా దొరుకుతూ ఉంటారని, అటువంటి అప్పుడు సావధానంగా వినాలని అనుగ్రహ భాషణం చేశారు. విజయయాత్రలో గుంటూరుకు రావడం ఆనందంగా ఉందని, ఈ యాత్రకు హృదయంలాంటిది గుంటూరు అని అభివర్ణించారు. గుంటూరు మండల వేద ప్రవర్తక విద్వత్ పరీక్షా సభ శతమానోత్సవం సందర్భంగా స్థానిక సంపత్‌నగర్ శ్రీ శృంగేరి శారదా పీఠ పాలిత శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ విధుశేఖర భారతి స్వామి సమక్షంలో ఋగ్వేద, అధర్వణ వేద పూర్ణాహుతి కార్య క్రమాలు వైభవంగా జరిగాయి. కృష్ణ యజుర్వేద, సామవేద శాంతి హోమాలు, పూర్ణాహుతి శనివారం నాడు నిర్వహించనున్నట్లు గబ్బిట శివరామకృష్ణ ప్రసాదు తెలిపారు. గురువందనం కార్యక్రమంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పొలిశెట్టి హరి ప్రసాదరావు, పొలిశెట్టి హరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాలకు కొరత లేదు

● జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో మొక్కజొన్న విత్తనాలకు కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లాలోని విత్తనాల డీలర్లు,డిస్ట్రిబ్యూటర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూజివీడు, పయినీర్, కావేరి, అడ్వెంట, మహికో, కార్నటెక్, బేయర్, శ్రీరామ, భారతి, ఎషియన్, అగ్రీ జెనెటిక్స్ , బయో సీడ్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీల వద్ద ఉన్న మొక్కజొన్న విత్తనాల నిల్వలపై సమీక్షించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రబీలో 25 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేసే అవకాశం ఉందని, అందుకు గాను ఐదు వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, డీలర్స్ వద్ద తొమ్మిది వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. జొన్న 20 వేల హెక్టార్లలో సాగు చేసే అవ కాశం ఉందని అందుకు గాను రెండు వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, మూడు వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. విత్తన శుద్ధి వలన కత్తెర పురుగు నుండి నాటిన 15 నుండి 20 రోజుల వరకు రక్షణ ఉంటుందని అన్నారు. రైతులు లూజ్ సీడ్ వాడవద్దని, శుద్ధి చేయని విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, బిల్లు తీసుకోవాలని సూచించారు. విత్తనాలను ఎంఆర్‌పీ కన్నా ఎక్కువకు విక్రయించినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేస్తామని డీలర్లను హెచ్చరించారు.

జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలు ఆపాల్సిందే

● దిగుమతి, ఎగుమతి వ్యాపారస్తుల సమావేశంలో మిర్చియార్డు సెక్రెటరీ


సమావేశంలో పాల్గొన్న వినుకొండ ఆంజనేయులు, వ్యాపారస్తులు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): మిర్చి యార్డులో జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాల వలన మార్కెట్ ఫీజు రూపంలో ఆదాయానికి గండి పడు తోందని, వీటిపై జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌చార్జి అమిలినేని భార్గవ తేజ చాలా సీరియస్ ఉన్నారని, సోమవారం నుంచి ఆయా అక్రమ వ్యాపా రాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు ఆదే శించారు. స్థానిక మిర్చియార్డు పరిపాలన భవనంలో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తుల యూనియన్ల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో మిర్చియార్డుని సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించడం జరిగిం దన్నారు. గతంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఇక నుంచి ఆ తప్పులు జరగడానికి వీల్లేదని, యార్డు గేట్ల వద్ద ఏళ్ల తరబడి పాతకుపోయిన సిబ్బందిని కూడా బదిలీ చేసినట్లు చెప్పారు. మిర్చి యార్డులోకి వచ్చే ప్రతీ మిర్చి టిక్కీ అకౌంట్ ఫర్ కావాల్సిందేనని, ఇదే విషయాన్ని గతంలో మార్కెటింగ్ కమిషనర్ కూడా చెప్పారని గుర్తు చేశారు. వ్యాపారస్తులకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరిం చేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 25 నుంచి అమలు జరగబోతున్న నూతన విధానాలకు వ్యాపా రస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తాము తర చుగా తనిఖీలు చేపడతామని, అప్పుడు ఎవరైనా అక్రమాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమా వేశంలో దిగుమతి, ఎగుమతి వ్యాపారస్తుల సంఘాల నాయకులు అప్పిరెడ్డి, జుగిరాజ్ భండారి, పమిడి కృష్ణ, కర్లపూడి వెంకటేశ్వరరావు, నరేంద్ర, యార్డు ఇన్‌ఛార్జ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యంగా 'మహిళా..మీకోసం'

● హెల్ప్‌లైన్ నంబర్ 97 4641 4641
● 25న ప్రాంభించనున్న కలెక్టర్ నాగలక్ష్మి



మహిళల భద్రత కోసం రూపొందించిన లోగో

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మహిళల సంరక్షణ సంకల్పంగా 'మహిళా..మీ కోసం' అనే వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న సాయంత్రం 4:00 గంటలకు గుంటూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూపొందించిన లోగోను ఎస్పీ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి 97 4641 4641 హెల్ప్ లైన్ నంబర్ కేటాయించినట్లు తెలిపారు. రాత్రి సమయాలలో మహిళలు ప్రయాణించేటప్పుడు ఏవైనా ఇబ్బం దులు ఎదురైతే వారిని రక్షించి సుర క్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ హెల్ప్ లైన్ నంబర్‌ను సేవ్ చేసుకొని అత్యవసర సమయాలలో పోలీసుల సహాయం పొందాలని సూచించారు.

జిల్లా అదనపు ఎస్పీగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా శాంతి భద్ర తల అదనపు ఎస్పీగా ఏటీవీ రవి కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ సతీష్ కుమా ర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలని, వీఐపీలు - వీవీఐపీల రాకపోకలతో ఎప్పుడూ రద్దీగా ఉండే గుంటూరు జిల్లాలో నిరంతర అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. కాగా, అదనపు ఎస్పీ రవి కుమార్ 2012లో డీఎస్పీగా నియమితులై సీఐడి, చింతూరు, పోలవరం, రాజమండ్రి ఈస్ట్‌లో డీఎస్పీగా పనిచేశారు. 2022లో అదనపు ఎస్పీగా ప్రమోషన్ పొంది భీమవరం జిల్లాలో పనిచేస్తూ సాధారణ బది లీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు నియమితులయ్యారు.

ఏఆర్ డీఎస్పీ శాంతికుమార్ బదిలీ.. ఏడుకొండలరెడ్డి నియామకం

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఏఆర్ డీఎస్పీగా డీ ఏడుకొండలరెడ్డి నియమితులయ్యారు. విశాఖపట్నం సిటీ హోంగార్డ్స్ డీఎస్పీగా ఉన్న ఏడుకొండలరెడ్డి ప్రస్తుతం అటాచ్‌మెంట్‌పై డీజీపీ కార్యా లయంలో ఉన్నారు. కాగా, ఇప్పటివరకు గుం టూరు జిల్లా ఏఆర్ డీఎస్పీగా ఉన్న ఆర్‌పీఎల్ శాంతి కుమార్‌ను ఇంటిలిజెన్స్‌కు బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం 29 మంది ఏఆర్ డీఎస్పీలను బదిలీ చేశారు. ఇందులో భాగంగా ఈ బదిలీలు జరిగాయి.

చీఫ్ విప్ ఆంజనేయులును అభినందించిన విష్ణువర్ధన్



గుంటూరు కార్పొరేషన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చీఫ్ విప్‌గా నియమితులైన వినుకొండ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులును పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కార్యదర్శి, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందనలు తెలిపారు. గుం టూరులో శుక్రవారం ఆయనను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మెరుగైన విద్యను అందిం చడంతో పాటు విద్యార్థులను క్రీడా, సాంస్కృతిక ప్రతిభా రంగాలలో ప్రోత్స హిస్తున్నారని అన్నారు.

సౌత్ జోన్ టెన్నిస్ పోటీలకు చరిష్మా నాగరాణి ఎంపిక


చరిష్మా నాగరాణిని అభినందిస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మణిపాల్‌లో డిసెంబరు 3 నుంచి జరగనున్న సౌత్ జోన్ మహిళా టెన్నిస్ క్రీడా పోటీలకు గుంటూరు నగరానికి చెందిన ఫిజియోథెరపీ డిగ్రీ విద్యార్థిని కె చరిష్మా నాగరాణి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియో థెరపీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుభాని ప్రత్యేకంగా అభినందించారు.

చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కల్పన బిల్లు ఆమోదంపై హర్షం

గుంటూరు(తూర్పు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి సిఫారసు చేయడంపై అఖిల భారత ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక హిందు కళాశాల కూడలిలో శుక్రవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

సివిల్ సప్లయిస్ కార్మికుల కూలీ రేట్ల పెంపుదలపై హర్షం

గుంటూరు(తూర్పు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ ముఠా కార్మికుల కూలీ రేట్లను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఏఐటీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పాతగుంటూరు. సివిల్ సప్లయిస్ గోడౌన్ల వద్ద నాయ కులు, ముఠా కార్మికులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ రాష్ట్ర నాయకులు చల్లా చిన ఆంజనేయులు, జీ సురేశ్‌బాబు మాట్లాడారు.

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ లోకోలో సాంకేతిక లోపం

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ లోకోలో సాంకేతిక లోపం తలెత్తింది. శుక్రవారం సాయంత్రం ఈ రైలు సికింద్రాబాద్ బయలుదేరి ఘట్‌కేసర్ వద్దకు వచ్చేసరికి మొరాయించడంతో అక్కడ నిలిపేసి మరమ్మతులు చేపట్టారు. అనంతరం ఫిట్ ఇవ్వడంతో రైలు బయలుదేరింది. ఈ కారణంగా గుంటూరుకు మూడు గంటలకు పైగా ఆలస్యంగా చేరుకుంది. రాత్రి 8.20 గంటలకు రావాల్సిన ఈ రైలు 11.20 గంటల తర్వాత వస్తుందని రైల్వే సిబ్బంది అనౌన్స్‌మెంట్ చేశారు. కాగా, ఈ రైలు వెనకగా రావాల్సిన పల్నాడు ఎక్స్‌ప్రెస్ గంటకు పైగా, విశాఖ అరగంట, చెన్నై గంటకు పైగా ఆలస్యంగా గుంటూరుకు చేరాయి.



ఊతమిస్తే.. ఉపాధి



మహిళల ఆర్థిక స్వావలంభనకు ఒకప్పుడు దిక్సూచిగా నిలిచిన కేంద్రమది. ఎన్నో శిక్షణా తరగతులు నిర్వహించి మహిళల స్వయంఉపాధికి బాటలు వేసిన కేంద్రం అది. అంతేకాదు అక్కడ ప్రింటింగ్, బైడింగ్, మసాల కారం, కేకులు, బనియన్లు తయారీ యూనిట్‌లను మహిళలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. అటువంటి ప్రతిష్టాత్మకమైన నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళాసాధికారత కేంద్రం (తెలుగు బాల మహిళా ప్రాంగణం) నేడు దాని ప్రాధాన్యాన్ని కోల్పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఊతమిస్తే తెలుగు బాల మహిళా ప్రాంగణం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని ఔత్సాహిక మహిళలు ఎదురుచూస్తున్నారు.

- పతనావస్థలో ఉపాధి శిక్షణా కేంద్రాలు
- స్వయం ప్రతిపత్తి దశ నుంచి క్షీణ స్థితికి
- నాడు లక్షల్లో టర్నోవర్.. నేడు జీతాల కోసం వెతుకులాట
- కమీషన్ల కోసం కక్కుర్తి, సిండికేట్ జోక్యంతో పతనం
- దశాబ్ద కాలంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లన్నీ మూత
- తుప్పుపట్టిపోతున్న యంత్రాలు, సామగ్రి
- మహిళా ప్రాంగణానికి నాటి వైభవం వచ్చేనా?

గుంటూరు(విద్య),నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు తొలిసారి ముఖ్యమంత్రి అయిన అనంతరం 1983లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు బాల మహిళా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఆ క్రమంలోనే గుంటూరు కలెక్టరు బంగ్లా సమీపంలో తెలుగు బాల మహిళా ప్రాంగణం ఏర్పాటు అయింది.



ప్రారంభంలో కేవలం స్వయం ఉపాధి శిక్షణలకే పరిమితమైన ఈ కేంద్రంలో తర్వాత అనేక స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటయ్యాయి. తొలుత ప్రింటింగ్, బైండింగ్ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీ, ప్రభుత్వ ప్రచారం కోసం ఉపయోగించే కరపత్రాలు, మల్టీకలర్ పోస్టర్స్ వంటివి ఇక్కడ ముద్రించి అందించే వారు. ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే అనేక ప్రింటింగ్ సామగ్రి ఈ కేంద్రానికే వచ్చేవి పలితంగా ఆర్థిక పరిపుష్టి సాధించడంతో కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బనియన్ల తయారీ, కేక్స్ యూనిట్, మసాల కారం, చెప్పులు, సబ్బులు తయారుచేసే యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. మహిళా ప్రాంగణం బ్రాండ్‌తో ఆయా ఉత్పత్తులను విక్రయించే వారు. రాష్ట్రంలో అనేక ప్రదర్శన శాలల్లో మహిళా ప్రాంగణం ఉత్పత్తులను ప్రదర్శించేవారు. ఇలా మంచి ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ప్రాంగణం స్వయం ప్రతిపత్తి సాధించే కీలక దశకు కూడా వచ్చింది. మరోవైపు జడ్పీ నుంచి సెస్‌రూపంలో కొంత మొత్తం నిధులను మహిళా ప్రాంగణాలకు విడుదల చేసే వారు. ఈ నిధులతో కంప్యూటర్ శిక్షణ, ఫ్యాబ్రిక్ పెయిటింగ్, బ్యూటీషియన్, కుట్టుశిక్షణ వంటి స్వయం ఉపాధి శిక్షణలు క్రమం తప్పకుండా నిర్వహించారు. దీంతో వేలాది మంది స్వయం ఉపాధికి ఈ ప్రాంగణం బాటలు వేసింది. అంతేకాదు ఔత్సాహిక మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి బిజినెస్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని కూడా మహిళా ప్రాంగణంలో ఇక్కడ ఏర్పాటు చేశారు.

ఉత్పత్తి కేంద్రాల పతనం ఇలా...

మహిళా ప్రాంగణంలో అనేక యూనిట్లులో పనిచేస్తున్న కీలకమైన వ్యక్తులు ప్రాంగణంలో అప్పట్లో విధులు నిర్వర్తించిన మేనేజర్లు కమీషన్లకు కక్కుర్తిపడి ఇక్కడకి వచ్చిన ప్రింటింగ్ ఆర్డర్స్ సకాలంలో పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రైవేటు ప్రెస్‌లకు తరలించేలా సిండికేట్ నడిపించారు. అంతేకాదు లక్షల విలువైన స్టేషనరీ పంపిణీ కూడా క్రమంగా ప్రైవేటు వ్యక్తుల పరమైంది. ప్రాంగణంలో ఉన్న కేక్‌యూనిట్, మసాలా కారం తయారీ యూనిట్లును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఆ తర్వాత మార్కెటింగ్ నిర్వహణా లోపం కారణంగా బనియన్ల తయారీ, చెప్పుల యూనిట్ మూతపడింది. దీనికితోడు గత వైసీపీ ప్రభుత్వ హయంలో మహిళా ప్రాంగణం మరింత దీన స్థితికి చేరింది. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలోని అనేక యూనిట్ల యంత్రాలు, సామగ్రి తుప్పుపట్టిపోతున్నాయి. ప్రభుత్వం, స్థానిక సంస్థల నుంచి నిధులు నిలిచిపోవడంతో సిబ్బంది జీతాలకే వెదుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర మహిళ ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ కావలి గ్రీష్మ ప్రాంగణాలకు పూర్వ వైభం తీసుకువస్తామని ప్రకటించారు. ఈనేపథ్యంలో అక్కడ ఉత్పత్తి కేంద్రాలకు పూర్వవైభవం వస్తుందని ఔత్సాహిక మహిళలు ఎదురు చూస్తున్నారు.



శిక్షణ లేక గోదాముకు చేరిన కుట్టుమిషన్లు



షెడ్డులో దుమ్ముపట్టి పోతున్న ప్రింటింగ్ యూనిట్



రాష్ట్రంలోని రోడ్లకు రెండేళ్లలో కొత్తరూపు

- గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు పక్కదారి
- అధ్వాన రహదార్లతో రాష్ట్ర ప్రగతికి విఘాతం
- సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లు
- ఆర్ అండ్ బీ శాఖా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి
- మంగళగిరిలో ఎన్‌డీబీ రహదారుల పనులు పునఃప్రారంభం



అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

మంగళగిరి సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని మొత్తం రోడ్లన్నీ పూర్తిగా కొత్తరూపు సంతరించుకుంటాయని ఏపీ రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన మంగళగిరి-నిడమర్రు ఎన్‌డీబీ రోడ్డు పనులను శుక్రవారం మంత్రి పునః ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు.

ఈసందర్భంగా మంత్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సహచర మంత్రి నారా లోకేశ్ సొంత నియోజక వర్గంలో ఎన్‌డీబీ రోడ్ల పనులను తిరిగి ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు. గత ప్రభుత్వం ఎన్‌డీబీ రోడ్లకు సంబంధించిన నిధులను పక్కదారి పట్టించడంతో రోడ్ల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని స్పష్టం చేశారు. అధ్వాన రహదార్లతో రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్లిపోయాయని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందలేకపోవడానికి అధ్వాన్న రోడ్లే కారణమని పేర్కొన్నారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం రూ.861 కోట్లతో ఇప్పటికే పనులను కూడా ప్రారంభించిందని తెలిపారు. తానే స్వయంగా కాంట్రాక్టర్లతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో తిరిగి పనులు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. జిల్లాలో రూ.120 కోట్లతోను, మంగళగిరి నియోజక వర్గంలో రూ.51.06 కోట్లతోను పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రజలకు అసౌకర్యం లేని రహదారులే లక్ష్యంగా పీపీపీ పద్ధతిలో కొత్త రహదార్ల ఏర్పాటుకు కొన్ని జిల్లాలను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి జనార్ధన్‌రెడ్డి నిడమర్రు గ్రామంలో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మంగళగిరి-పరిమి రోడ్డును విస్తరించాలని గ్రామస్తులు కోరడంతో సానుకూలంగా స్పందించారు.

ఈకార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ నయీముల్లా, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుర్రా బ్రహ్మం, నేతలు ఉయ్యూరు సాంబిరెడ్డి, గాదె లక్ష్మారెడ్డి, బూదాటి ఏడుకొండలు, కొమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి, కంఠం వెంకటరెడ్డి, కుర్రా పుల్లయ్య, బొల్లా రంగారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు.. నిధులు

(5వ పేజీ తరువాయి..)

నిధులు విడుదల చేసింది. అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణాల్లోనే ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నిమ్మ, నారింజ, బొప్పాయి, అరటి వంటి పండ్ల మొక్కలతో పాటు తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి కూరల మొక్కలు పెంచి వాటితోనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం సూచించింది.

- గుంటూరు జిల్లా: 152 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.54.72 లక్షలు, 188 కేంద్రాల్లో మంచినీటి సదుపాయానికి రూ.32 లక్షలు, పోషణ వాటిక, వర్షపు నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన కింద 204 కేంద్రాలకు రూ.93.43 లక్షలు కేటాయించింది.
- బాపట్ల జిల్లా: 190 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.68.40 లక్షలు, 258 కేంద్రాల్లో మంచినీటి సదుపాయాలకు రూ.43.86 లక్షలు, 261 కేంద్రాల్లో పోషణ వాటికలు, వర్షపు నీటి నిర్వహణకు కోటీ 19 లక్షల 8 వేలు కేటాయించింది.
- పల్నాడు జిల్లా: 243 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.87.48 లక్షలు, 369 కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలకు రూ.62.73 లక్షలు, 67 కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పోషణ వాటికల ఏర్పాటు, వర్షపునీటి యాజమాన్యం నిర్వహణకు రూ.30.68 లక్షలు కేటాయించింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూపరింటెండెంట్ రమణ యశస్వి

ఆధునిక వైద్య విధానంపై అవగాహన అవసరం

- జీఎంసీ ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుందరాచారీ వెల్లడి
- గుంటూరులో ప్రారంభమైన ఐఎంఏ రాష్ట్ర సదస్సు

గుంటూరు మెడికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో రాణించేందుకు, ఆధునిక వైద్య రంగంలో వస్తున్న నూతన చికిత్సా విధానాలను ఎప్పటికప్పుడు వైద్యులు తెలుసుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ ఉద్బోధించారు. శుక్రవారం వైద్యకళాశాల జింకానా ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 66వరాష్ట్ర వార్షికసదస్సు 'ఏపీకాన్ 2024' ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు సదస్సు సైంటిఫిక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సీహెచ్ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ సుందరాచారీ, ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. 16 ఏళ్ల తర్వాత ఐఎంఏ రాష్ట్ర సదస్సు గుంటూరులో నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ సుందరాచారీ తెలిపారు. వైద్యరంగంలో ఇప్పుడు పరిశోధన అవకాశాలు పెరిగాయన్నారు. యువ వైద్యులు వ్యాధుల నిర్ధారణ, చికిత్స విధానాలు, పరిశోధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానాల ద్వారా సమర్థ వంతమైన చికిత్సలు రోగులకు లభిస్తున్నాయని, వాటి గురించి తెలుసుకొనేందుకు ఐఎంఏ రాష్ట్రస్థాయి సీఎంఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

సీఎంఈలకు హాజరు తప్పనిసరి..

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ఎం పర్నీకుమార్ మాట్లాడుతూ వైద్యులకు సంవత్సరానికి ఆరు చొప్పున ఐదేళ్లల్లో 30 సీఎంఈ క్రెడిట్ అవర్స్ ఉంటేనేవారి డిగ్రీ మెడికల్ కౌన్సిల్ రీరిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. సభలో ఐఎంఏ రాష్ట్రశాఖ నూతన అధ్యక్షుడుగా డాక్టర్ గార్లపాటి నందకిషోర్, రాష్ట్ర కారయదర్శి డాక్టర్ పీ ఫణిధర్, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ డాక్టర్ టీ. సేవకుమార్, గుంటూరుశాఖ అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ వై.సుబ్బారాయుడు, డాక్టర్ బీ.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సైంటిఫిక్ సెషన్ జరిగింది. జింకానా ప్రధాన ఆడిటోరియంలో సైంటిఫిక్ సెషన్‌లో పలువురు వైద్యులు ప్రసంగించారు. మెడికల్‌పీజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో కూడా సదస్సు జరుగుతుంది.



బావాజీపాలెం ఏరియల్ వ్యూ

బావాజీపాలెం సైనికులు





దేశం కోసం పనిచేయడం సైనికులు గర్వంగా భావిస్తారు. దేశరక్షణలో ముందుంటూ సరిహద్దుల్లో బాధ్యతగా పనిచేస్తూ ఉంటారు. మరి, అటువంటి సైనికులను ఒకరిని కాదు ఇద్దరిని కాదు.. ఏకంగా వందల సంఖ్యలో దేశానికి అందిస్తున్న ఘనత బావూజీపాలెం గ్రామానిది. మూడు నాలుగు తరాలుగా ఈ గ్రామం నుంచి సైన్యంలో పని చేసిన వారు, ప్రస్తుతం చేస్తున్నవారు ఉన్నారు. ఇప్పటికీ ఈ గ్రామం నుంచి 200 మంది సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో సేవలంది స్తున్నారు. సైన్యంలో చేరేందుకు 'సై' అంటున్న సైనికుల గ్రామం బావాజీపాలెం గురించిన విశేషాలు..

- ఇంటికి ఇద్దరు, ముగ్గురు జవాన్లు
- 1980లోనే ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ
- సరిహద్దుల్లో పనిచేయడం గర్వకారణమంటున్న సైనికులు

రేపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని నిజాంపట్నం మండలం బావాజీపాలెం గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పనిచేస్తుంటారు. సైన్యంలో పని చేయడమంటే ఎంతో బాధ్యతగా భావిస్తారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు వందల సంఖ్యల్లో ఇక్కడ నుంచి ఆర్మీలో పని చేసిన వారున్నారు. నేటికీ అదే స్ఫూర్తితో 200 మందికి పైగానే ఇంటికి ఇద్దరు చొప్పున ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. మైనర్ పంచాయతీ బావాజీపాలెంలో 550 కుటుంబాలు ఉండగా 2,400 మంది జనాభా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సరిహద్దులో విధులు నిర్వహించి ఇప్పటికే 400మంది ఉద్యోగ విరమణ చేశారు. ఇప్పటికీ 200 మంది సరిహద్దుల్లో పలుప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు.

1980లో గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ

ఈగ్రామంలో అత్యధికంగా సైనికులు ఉన్నారని గుర్తించిన ఆర్మీ మద్రాస్ స్పాన్సర్ ఉన్నతాధికారులు 1980లో దీనిని దత్తత తీసుకుని మంచినీటి పథకం నిర్మించారు. అప్పట్లోనే గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్మీలో చేసే వారి కోసం ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ గ్రామం నుంచి ఎవరైనా ఆర్మీలో చేరేందుకు వెళితే వెంటనే వారికి అనుమతులు మంజూరు చేస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో..

ఈ గ్రామానికి చెందిన అబ్దుల్ అజీమ్, అబ్దుల్ హమీమ్‌లు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. మహ్మద్ యాకబ్, అబ్దుల్ అజీద్, అహ్మద్ రఫీ, రియాజ్ బాషా, మహ్మద్ షారూక్ సైన్యంలో సేవలు అందిస్తూ పలు ప్రమాదాల్లో మృతి చెందారు. వీరిలో కొందరు కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు.



ఆర్మీ దత్తత తీసుకుని నిర్మించిన ఓవర్‌హెడ్‌ట్యాంక్

అబ్బాయి పుడితే ఆర్మీకే

గ్రామంలో ఎవరి కుటుంబంలోనైనా అబ్బాయి పుడితే ఆర్మీకే పంపుతారు. తండ్రులు ఆర్మీలో చేరడం వారి తనయులను పంపటం ఆనవాయితీగా వస్తోంది. తండ్రులు, తనయులు, ఇంటి అల్లుళ్ళతో కలిసి ఒకే ఇంట్లో ముగ్గురు,నలుగురు చొప్పున సైనికులు కూడా ఉన్నారు. కాశ్మీర్,రాజస్థాన్, చైనా బోర్డరులో విధులు నిర్వహిస్తూ దేశానికే గర్వకారణంగా బావూజీపాలెం నిలుస్తుంది.

అమ్మాయి పుడితే సైనికుడితోనే పెళ్ళి

మిలటరీ కుటుంబాల్లో అమ్మాయి పుడితే సైన్యంలో పనిచేసే వ్యక్తికే ఇచ్చి వివాహం జరిపిస్తారు.ఆర్మీలో చేసే వ్యక్తినే ఆ ఊరి ఆడపిల్ల మనువాడటానికి మక్కువ చూపుతుంది. ఇప్పటికే సుమారు 100 మందికి పైగా ఆఊరి ఆడపిల్లలు సైన్యంలో పని చేసే వారినే పెళ్లిళ్ల చేసుకున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు.

శ్రీలంక, కార్గిల్ యుద్ధాల్లో సేవలు



- అమానుల్లాఖాన్,మాజీ సైనికుడు

దేశసరిహద్దుల్లో వివిధ ప్రాంతాల్లో 30 ఏళ్ళ పాటు పని చేసి సుబేదారుగా ఉద్యోగ విరమణ చేశా. అప్పట్లో ఎలాంటి సమాచార వ్యవస్థ ఉండేది కాదు. కుటుంబ సభ్యులు యోగక్షేమాలు తెలిసేవికాదు. యుద్ధ సమయాల్లో కుటుంబసభ్యులు గుర్తుకు వచ్చినా 'దేశం తర్వాతే కుటుంబం' అనే నినాదంతో పనిచేశాం. నా తండ్రి ఆర్మీలోనే పనిచేశారు. నా కుమారుడిని ఆర్మీలోకి పంపాను. సైన్యంలో పనిచేసే వ్యక్తితోనే నా కుమార్తెకు వివాహం జరిపించాను.

నేనూ తమ్ముడు సైన్యంలోనే..



- సిరాజుద్దీన్ బాబు,సైనికుడు.

మా తాత, నాన్న ఆర్మీ లోనే పని చేశారు. నేనూ, నాతమ్ముడు కూడా సైన్యంలోనే పనిచేస్తున్నాం. మా అక్కను ఆర్మీలో పనిచేసే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశాం. మా గ్రామానికి సైనికుల గ్రామంగా గుర్తింపు ఉంది. ఆ మాటలు వింటే గర్వంగా ఉంటుంది. మాజీ సైనికుడే ప్రస్తుతం మా గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నాలుగు తరాలు మిలటరీలోనే విధులు



- మస్తాన్‌వలీ, మాజీ సైనికుడు

దేశ రక్షణ కోసం మా కుటుంబం నుంచి నాలుగు తరాలుగా సైన్యంలో పనిచేస్తున్నాం. మంచుకొండలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించాం. 1965లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నేను 1987లో ఉద్యోగ విరమణ చేశాను. జమ్మూకాశ్మీర్, మిజోరాం, అబీఘర్, శ్రీగంగానగర్‌లో పంజాబ్‌లో విధులు నిర్వహించాను. మా తాత మహ్మద్ అనీఫ్ మిలటరీ విధులు నిర్వహించారు. యుద్ధంలో మృతి చెందారు. మా తండ్రి అహ్మద్ ఇబ్రహీం ముప్పై ఏళ్ల పాటు దేశరక్షణకు సేవలు అందించారు. నా ముగ్గురు కుమారులు ఆర్మీలోనే పనిచేస్తున్నారు. ఇద్దరు అమ్మాయిలను కూడా ఆర్మీలో పనిచేసేవారికి ఇచ్చి పెళ్లిళ్ల చేశాను. దేశ వ్యాప్తంగా మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు ఉండటం గర్వపడే విషయం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుళ్లూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) మందడం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఉమా మహేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గమనించి వినియోగ దారులు సహకరించాలని కోరారు.

చిరస్మరణీయుడు డాక్టర్ ఎమ్మెస్సెస్

● 23వ వర్ధంతి సభలో వక్తలు
● కోటేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పించిన టీడీపీ నేతలు



డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు విగ్రహానికి నివాళులు అర్పించిన టీడీపీ నాయకులు

మంగళగిరిసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని పలువురు నేతలు పేర్కొన్నారు. మాజీమంత్రి డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు 23వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వర రావు, ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం నేతలు నివాళి అర్పించారు. అక్కడి నుంచి టీడీపీ నేతలు ప్రదర్శనగా బస్టాండు సెంటరును చేరు కుని ఎమ్మెస్సెస్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన వర్ధంతి సభలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ నియోజక వర్గంలో అత్యధిక మందికి ఇళ్ల స్థలాలు, వృత్తి పరమైన రుణాలు అందించిన ఘనత ఎమ్మెస్సెస్‌కే దక్కుతుంద న్నారు. పేదలకు వైద్యం అందుబాటులో వుండాలని ఆశించిన ఆయన 1104 మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఒకేరోజున రాష్ట్రమంతటా ఏర్పాటుచేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఆసియా ఖండంలోనే తొలిసారిగా విజయవాడలో ఎన్టీఆర్ మెడికల్ యూనివర్సిటీని నెలకొల్పారని అన్నారు. చేనేతలకు ఉచిత వైద్యం, మంగళగిరి ప్రాంతానికి తాగునీరు, మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి ఎగువ సన్నిధికి ఘాట్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, ప్రభుత్వ ఆస్పత్రి, ఎత్తిపోతల పథకాలను నిర్మించడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఎమ్మెస్సెస్ స్ఫూర్తితో మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజక వర్గాన్ని దేశంలోనే రోల్ మోడల్‌గా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీని వాసరావు, బీజేపీ నేత మాదల శ్రీనివాసరావు, సీపీఎం నేత జేవీ రాఘవులు, సీపీఐ నేత కంచర్ల కాశియ్య, కూటమి నేతలు గుత్తికొండ ధనుంజయరావు, తోట పార్థసారథి, కేసంనేని శ్రీఅనిత, బెల్లంకొండ నరసింహా రావు, షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, మహ మ్మద్ ఇబ్రహీం, మున్నంగి శివశేషగిరిరావు, మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ, జవ్వాది కిరణ్‌చంద్, మాదల రమేష్ బాబు, జంజనం వెంకట సుబ్బారావు, మన్నెం రమేష్ బాబు, పోలుమట్ల ప్రేమ్‌కుమార్, సంకా బాలాజీ గుప్తా, గాదె పిచ్చిరెడ్డి, షేక్ జిలానీ, గోసాల రాఘవ, రంగిశెట్టి పెద్దబ్బాయ్, విన్నకోట శ్రీనివాసరావు, ఆకురాతి నాగేం ద్రం, గోలి నాగశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హాస్పటల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

రాజధానిలో బసవతారకం హాస్పటల్

స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బాలకృష్ణ

తుళ్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇండో-అమెరికన్ బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు రెవెన్యూలో 15 ఎకరాలు భూమిని కేటాయించింది. పనులు మొదలు పెట్టే సమయానికి వైసీపీ సర్కార్ వచ్చి రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో అమరావతిలో పలు సంస్థలు నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు వస్తున్నాయి. హిందుపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ శుక్రవారం తుళ్లూరు రెవెన్యూలో హాస్పటల్ స్థలాన్ని పరిశీలించారు. బాలకృష్ణ వచ్చిన విషయం తెలిసి రైతులు ఆయనను కలసి మాట్లాడారు. అమరావతి రైతులతో ఆయన ఫోటోలు దిగారు.

మద్యం అక్రమ అమ్మకాలపై దాడులు

మంగళగిరి సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాడవాడలా మద్యం శీర్షికన ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనంతో మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. తాడేపల్లి పరిధిలోని డోలాస్‌నగర్, నులకపేట, సీతానగరం, తాడికొండ మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం దాడులు నిర్వహించారు. సీతానగరంలో అనధికారికంగా మద్యం అమ్ముతుండగా ఒక మహిళను అదుపులోకి తీసుకుని, 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు మంగళగిరి ఎక్సైజ్ సీఐ జీ.వీరాంజనేయులు తెలిపారు. గత పది రోజుల్లో మంగళగిరి సర్కిల్ పరిధిలో మొత్తం పది కేసులు నమోదు చేసి పది మంది నిందితులను అరెస్టుచేసి, 119 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పశ్చిమడెల్టా కాల్వకు

4247 క్యూసెక్కులు..

దుగ్గిరాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 4247 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 216 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 625, తూర్పు కాల్వకు 52 , పశ్చిమకాల్వకు 92, నిజాంపట్నం కాల్వకు 225, కొమ్మమూరుకాల్వకు 2400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

502 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల , నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 502 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, కాయ ఒకే ధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,700 గరిష్ఠ ధర రూ. 11,850, మోడల్‌ధర రూ. 11,850 పలికాయి. కనిష్ఠ ధర రూ.11,700 గరిష్ఠ ధర రూ. 11,850, మోడల్‌ధర రూ. 11,850 పలికాయి

రేపు మెగా జాబ్ మేళా

● హాజరుకానున్న 50కు పైగా కంపెనీలు

మంగళగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంగళగిరి వీటీజేఎం, ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 24న మెగా జాబ్ మేళా జరుగనుంది. ఉదయం 10 గంటల నుంచి జరుగనున్న ఈ జాబ్ మేళాలో 50కు పైగా కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, ఐదు వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఏడు నుంచి పదవ తరగతి చదివిన వారు, ఇంటర్, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, ఎంసీఏ, ఎమ్మెస్సీ పీజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేవలం మంగళగిరి నియోజకవర్గానికి చెందిన యువతకు మాత్రమే ఉదయం పది గంటల కల్లా బయోడేటా, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు సెల్: 9642333668, 9030047303, 88861 11981 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి

తాడేపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని ఆరవ సచివాలయంలో వీఆర్వో సంధ్యకు సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమిల్ల వెంకటయ్య, పేద మహిళలతో కలిసి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కంచర్ల కాశయ్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, లోకేశ్, ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.



జాతీయ పోటీలకు ఎంపికైన యువకులు

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు

ఫిరంగిపురం యువకులు

ఫిరంగిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం గ్రామానికి చెందిన వంగివరపు విల్ స్మిత్, అనుములగుత్తి స్టాలిన్ బాబులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని, మండల ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల సత్తెనపల్లిలో నిర్వహించిన అండర్ - 19 ఫుట్ బాల్ పోటీల్లో విల్‌స్మిత్, స్టాలిన్‌బాబులు ప్రతిభ కనబరచగా వారిని జాతీయ పోటీలకు ఎంపికచేశారు. కాగా వీరు మణిపూర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనున్నారన్నారు.

26న నిరసనోద్యమం

ఫిరంగిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా 500 ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. ఈక్రమంలో 26న గుంటూరులో చేపట్టే ర్యాలీ, బహిరంగ సభల ను జయప్రదం చేయాలని కోరుతూ ఫిరంగి పురంలో శుక్రవారం రైతు సంఘం జిల్లా నేత మార్పుల వెంగళరెడ్డి కరపత్రాలను విడుదలచేశారు. కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్ర మంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, రైతుసంఘం నేతలు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించండి

తాడికొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏరువా అంజిరెడ్డి శుక్రవారం ఎంపీడీవో సమతావాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కలు పెరిగిపోయాయని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కలను నియంత్రించి అవసరమైతే స్టెరిలైజేషన్ చేయాలని కోరారు. పెంపుడు కుక్కలకు పంచాయతీ ద్వారా అనుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కర రావు, సానికొమ్మ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలను వేగంగా పరిష్కరించాలి

● అధికారులకు సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీ. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశం



గ్రీవెన్స్‌లో రైతులతో మాట్లాడుతున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీఎస్ఎస్. ప్రవీణ్ చంద్

తుళ్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) గ్రీవెన్స్ అర్జీలను వేగంగా పరిష్కరించాలని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీ.సూర్య సాయి ప్రవీణ్‌చంద్ అన్నారు. ప్రతి శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామాల రైతులు అదనపు కమిషనర్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సంద ర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడు తూ గ్రీవెన్స్‌లో రైతులు, ప్రజలు విన్నవించిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని,సమస్యల పరిష్కరించటంలో అలసత్వం వద్దని అధికారులకు సూచించారు. రాజధాని గ్రామాల రైతులు, ప్రజలు గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

భూమి వ్యవహారాలు 61, ప్రణాళికా విభాగం 2, డెవలప్‌మెంట్ ప్రమోషన్స్ 5, అకౌంట్స్, ఫైనాన్స్ 1, సమస్యలపై ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, స్వర్ణమేరి, శ్రీనివాసనాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ.రామకృష్ణ, డీసీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దారులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను

సద్వినియోగం చేసుకోవాలి

తాడికొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎంపీడీవో కే.సమతావాణి సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్యాంకు సేవలపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను దృష్ట్యా ప్రభుత్వాలు వివిధ బ్యాంకు లావాదేవీలను నిర్వహిస్తున్నాయని, బ్యాంకుల ఆర్థిక లావాదేవిలపై మహిళలకు అవగాహన అవసరమని తెలిపారు. బ్యాంకుల పేరుతో మోసాలకు పాల్పడేవారి నుంచి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ల్యాంపు సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, డీ.వెంకటేష్, జీ.పరమేశ్వర్‌రెడ్డి, అక్షయ్, లక్ష్మీ ప్రియాంక, , ఏపీఎం సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

తాడేపల్లిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్నంలో అత్యాచారానికి గురైన బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు సుధ కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని శుక్రవారం తాడేపల్లి సుందరయ్య నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుధ మాట్లాడుతూ సమాజంలో నానాటికీ నైతిక విలువలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉష, గిరిజ, శ్రీవాణి, అనిత, మణి, ధనలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

మంగళగిరి సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టిప్పర్ల బజారులోని నారాయణ పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్ పేరిట శుక్రవారం క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ ప్రసన్నాంజనేయులు క్రీడా జ్యోతిని వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. నారాయణ ఏజీఎం రమేష్‌రెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ సతీష్, హైస్కూల్ కోఆర్డినేటర్ జే.శశిధర్, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ బీ.శ్రావణి, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ హెప్సిబా, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనకు

వైజ్ఞానిక యాత్రలు దోహదం

తాడేపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఆటోమోటివ్ ట్రేడ్ విభాగం నందు శుక్రవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం తాతిరెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ అరవింద్, ఐసీఏ ఎడ్యుకేషనల్ స్కిల్స్ వారి ఆధ్వర్యంలో కుంచనపల్లిలోని కేఎల్ యూనివర్సిటీని విద్యార్థులు సందర్శించారు. జ్ఞాన సముపార్జనకు, ప్రత్యక్ష అనుభవాలు పొందటానికి ఇలాంటి ఫీల్డ్ విజిట్‌లు ఉపయోగపడతాయని హెచ్‌ఎం తాతిరెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ అరవింద్‌లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల నుండి ఉపాధ్యాయులు పర్వీన్ సుల్తానా, ఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

మద్దతుధర చట్టం తేవాలి

తాడేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర చట్టం తీసుకురావాలని గుంటూరుజిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జొన్నా శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉండవల్లి ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో శివశంకర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. ఓ పక్క రైతే దేశానికి వెన్నెముక అంటూ మరో పక్క రైతుల వెన్ను విరుస్తోందని చెప్పారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 26న గుంటూరులో జరిగే కార్మిక, కర్షక ర్యాలీకి ప్రజలందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్‌లో నేతలు కెఈ జగదీశ్వర్‌రెడ్డి, టి బక్కిరెడ్డి, వీరాస్వామి ఈమని రామారావు, గాంధి, ఇమ్మానుయేలు రాజు, కోటేశ్వరరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న శివశంకర్

నేడు, రేపు ఓటర్ల జాబితా సవరణ క్యాంపులు

మంగళగిరిసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 23,24 తేదీల్లో ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితా-2025 సవరణ నిమిత్తం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారిణి ఎ.లక్ష్మీకుమారి తెలిపారు. సంబంధిత బీఎల్వోలు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాతో అందుబాటులో వుంటారని చెప్పారు. అర్హత వుండి ఓటర్ల జాబితాలో పేరు లేని వారు ఫారం-6, జాబితాలో పేరు వుండి మార్పులు, సవరణల కోసం ఫారం-8, పోలింగ్ కేంద్రం మార్పు కోసం ఫారం-8 (మైగ్రేషన్), ఓటర్ల జాబితాలో పేరువుండి ఎవరైనా మరణించినా, వేరేప్రాంతానికి శాశ్వతంగా వలసవెళ్లినా ఫారం-7ను దాఖలు చేసుకునేందుకు ఎన్నికలసంఘం అవకాశం కల్పించిందన్నారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయ్యప్పస్వామికి ఇరుముడులు

దుగ్గిరాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం ఈమనిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అయ్యప్పల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇరుముడితో శబరిమలయాత్రకు బయలుదేరిన అయ్యప్ప భక్తులతో కలిసి పూజాకార్యక్రమం నిర్వహించారు. జనసేన నేతలు తుమ్మపూడి ప్రసాద్(చంటి) పలువురు జనసైనికులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అలరించిన 'బాలానందం'

తాడేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని అరవింద హైస్కూల్లో ప్రతి ఏడాది నిర్వహించే బాలానందం కార్యక్రమాలు ఈ ఏడాది శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 3,4,5 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు వివిధ విభాగాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విశ్రాంత ఉపాధ్యాయులు టీఎస్ఎస్ఆర్ మాస్టారు ముఖ్య అతిథిగా విచ్చేసి 'భూమి' ప్రాముఖ్యతను విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులు చేసిన ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. విద్యార్థులు చేసిన ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అలరించింది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రావీణ్యాన్ని కలిగి ఉండాలని ఈ సందర్భంగా వక్తలు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ నీరజహరి, ప్రిన్సిపాల్ ఇంద్రాణి, హెచ్‌ఎం అనూరాధ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

ఆలయానికి దాతల విరాళం

దుగ్గిరాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం కంఠంరాజుకొండూరులో వేంచేసియున్న మహం కాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల కోసం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన కే.శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు రూ.1,00,006 విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సదర్భంగా ఆలయ అర్చకులు తారక్‌నాథ్‌శర్మ, మణికంఠలు దాతలను అభినందించి వారికి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

తుళ్లూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) తుళ్లూరులోని టిడ్కో ఇళ్ల వద్ద శుక్రవారం టీడీపీ నేతలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, టీడీపీ నేతలు జొన్నలగడ్డ కిరణ్, ఉప్పలపాటి సాంబశివరావు, జమ్ముల అనిల్, హరికిరణ్(బాబి), బండ్ల పట్టాభిరామయ్య, పాటిబండ్ల జయకృష్ణ, కొల్లి నరేంద్ర, పరుచూరి ప్రభాకర్, జెట్టి రమేష్ పాల్గొన్నారు

నూతన వంతెన నిర్మించాలి

మంగళగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి గ్రామం సమీపానవున్న రేవేంద్రపాడు వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఈ క్రమంలో నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని సీపీఎం మండల మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళగిరి మండల సీపీఎం మూడవ మహాసభ శుక్రవారం కాజ గ్రామంలో బి.కోటేశ్వరి, గండికోట బాబూవరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం తప్ప సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతూ ప్రజల వేతనాలు నామమాత్రంగానే వుంటున్నాయని, ఫలితంగా ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. జమిలి ఎన్నికలు తెచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శిగా వుద్దంటి దుర్గారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం నేతలు వై.నేతాజీ, ఈ.అప్పారావు, ఎం.రవి, పకీరయ్య పాల్గొన్నారు.

కంప్యూటరీకరణను

వేగవంతం చేయాలి

పెదనందిపాడు, నవంబరు 22: ఖాతాదారుల రుణాల వివరాలను త్వరతిగతిన కంప్యూటరీకరణ చేయాలని జీడీసీఎంఎస్ సీఈవో కృష్ణవేణి బ్యాంకు సిబ్బందికి సూచించారు. స్థానిక పెదనందిపాడు పీఏసీఎస్ కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జిల్లాలో అన్ని మండలాల్లో కంప్యూటరీకరణ పూర్తయిందని, ఆలస్యంకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే పీఏసీఎస్ లక్ష్యమన్నారు. ఆమె వెంట సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



చేనేత మొల కట్టడాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

చేనేత అభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి

మంగళగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. తెనాలికి చెందిన వెస్ట్ బెర్రీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం శుక్రవారం మంగళగిరి ఆటోనగర్‌లో మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన వీవర్‌శాలను సందర్శించారు. చీర తయారీలో వాడే నూలు, పత్తి నుంచి దారంగా తయారై అన్ని రకాల ఉప పనుల తరువాత మగ్గంపై చీర తయారయ్యే విధానాన్ని విద్యార్థులు ఎంతోశ్రద్ధతో పరిశీలించారు. చేనేత కార్మికుల ప్రయోజనం కోసం ప్రత్యేకంగా వీవర్‌శాలను ఏర్పాటు చేసిన మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వీవర్‌శాల కమిటీ సభ్యుడు గుత్తికొండ ధనుంజయ రావు, సిబ్బంది అనిల్, సంతోష్, వెస్ట్ బెర్రి స్కూల్ హెచ్‌ఎం నన్నపనేని జ్యోతి, ఉపాధ్యాయులు దివ్య, సూర్యప్రభ, స్నిగ్ధ, యశస్విని, హన్సుజ,రూప్య పాల్గొన్నారు.

25న గన్నవరం రైతులకు

రిటర్నబుల్ ప్లాట్ల ఈ -లాటరీ

తుళ్లూరు, నవంబరు22(ఆంధ్రజ్యోతి) గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి కోసం భూములిచ్చిన రైతులకు ఈనెల 25న సోమవారం రిటర్నబుల్ ప్లాట్లకు ఈ-లాటరీ జరుగుతుందని సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20 మంది అర్హులైన రైతులకు 39 నివాసం, వాణిజ్య ప్లాట్లకు విజయవాడ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఈ-లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రొవిజన్ అలాట్‌మెంట్ సర్టిఫికెట్ పొందుటకు వారి ఆధార్ కార్డుతో తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి భూములిచ్చిన రైతులకు రాజధానిలో ప్లాట్లు ఇస్తామని గత టీడీపీ ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే.



ఖాళీ కంచాలతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఖాళీ కంచాలతో కార్మికుల నిరసన

తాడేపల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల ఆకలి కేకలను యాజమాన్యం ప్రభుత్వం ఇప్పటికైనా వినాలని, న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం దీక్షా శిబిరం వద్ద ఖాళీ కంచాలతో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ కార్మికులు చేస్తున్న పోరాటం న్యాయమైందని, మంత్రి లోకేశ్ జోక్యం చేసుకుని కార్మికుల సమస్య పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించి లోకేశ్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, ఆశీర్వాదం, దర్శి రమేష్, ఆదినారాయణ, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, అంకయ్య, బాషా, నవనీతం, శారద, సామ్రాజ్యం, దుర్గాంబ, సారమ్మ, యోహోషువ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ

మంగళగిరి సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి మండల పరిషత్ సమావేశ మందిరంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు హాజరై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ తరచు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించాలని, పంట సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని రైతుల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. మంగళగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు గాయం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో కొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రబీ పంట నమోదులో ప్రతి పంట సాగుదారుని వివరాలు నమోదుచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ సహాయవ్యవసాయ సంచాలకులు ఎం.హైమావతి, డీఏఏటీటీసీ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట రాములు, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి, ఏవోలు జెడ్.శైలజారాణి, ఎ.శ్రీనివాసులు, ఏఈవోలు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య.. కేసు

పెదనందిపాడు, నవంబరు 22: యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని అబ్బినేనిగుంట పాలెంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహ్మద్ బాజి అబీరున్(18) పదో తరగతి ఫెయిల్ అవడంతో కుటుంబ సభ్యులతో పొలం పనులకు వెళ్తుంది. మహ్మద్ బాజి అబీరున్‌కు బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం ఖాజీపాలెంకు చెందిన మహ్మద్ ఫాతిమా పిన్ని అవుతుంది. ఈ క్రమంలో మహ్మద్ బాజి అబీరున్‌కు ఫాతిమా గతేడాది లక్ష రూపాయలను వేరే వ్యక్తి వద్ద వడ్డీకి ఇప్పించింది. ఈ నెల 20న ఫాతిమా అబ్బినేనిగుంటపాలెం వచ్చి అప్పు ఇచ్చిన వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సాధ్యమైనంత త్వరగా అప్పు డబ్బు ఇవ్వాలని అబీరున్‌ను కోరింది. ఇవ్వకపోతే తాను చచ్చిపోతానని చెప్పి తిరిగి స్వగ్రామానికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో అబీరున్ తన పిన్ని ఫాతిమాకు ఫోన్ చేయగా సిచ్చాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన అబీరున్ పురుగుల మందుల తాగి అపస్మారక స్థితికి వెళ్లడంతో స్థానికులు 108 లో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అబీరున్ శుక్రవారం మృతి చెందింది. తల్లి పరేజాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధు పవన్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలి క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడికి దిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానిక చినరావూరుతోటకు చెందిన మహిళ పద్మావతిపై పాత కక్షల నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దాడి చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డిసెంబరు 16 నుంచి శ్రీకృష్ణ దీక్ష మహోత్సవాలు

తెనాలి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం పురస్కరించుకుని శ్రీకృష్ణ దీక్ష మహోత్సవాలు డిసెంబరు 16న ప్రారంభం అవుతాయని నరేంద్ర దాసనుజ స్వామి తెలిపారు. ఉత్సవాల బ్రోచర్లను శుక్రవారం భక్తులతో కలిసి ఆవిష్కరించారు. నెల రోజుల పాటు వీఎస్ఆర్ కళాశాల మార్గంలో నిర్వహించే ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని కోరారు. ప్రతిఏటా ధనుర్మాస ఉత్సవాలను ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్నామన్నారు. లోక కల్యాణం, భక్తుల సంక్షేమం నిమిత్తం చేపట్టిన ఉత్సవాలలో ప్రతిరోజు తిరుమంజనం, శతనామార్చన, తిరుప్పావై, గోపూజ, తీర్థగోష్టి, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహిస్తామని తెలిపారు. ఎనిమిది ముఖ్యమైన రోజులలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని శరణగతి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వామి చెప్పారు. పెనుగొండ వెంకటేశ్వరరావు, తన్నీరు సీతారామయ్య, వాసుబాబు, శ్యాంసుందరరావు, విజయలక్ష్మి, తన్నీరు శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన చైర్‌పర్సన్ రాధిక

తెనాలి మారీసుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లలోని వ్యర్థాలను తొలగించాలని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. శుక్రవారం పట్టణంలోని 17, 18వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు డ్రెయిన్‌లను ఆక్రమించవద్దని చెత్తను కాలువలలో వేయరాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, వైద్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, ఇన్‌చార్జ్ ఏఈ కళ్యాణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జక్కా శ్రీనివాస్‌కు ఘన నివాళి

పొన్నూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి జక్క శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి శుక్రవారం మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా జక్క శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని జక్క శ్రీనివాస్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆత్మీయులు పాల్గొన్నారు.

26న నిరసన ప్రదర్శన

పొన్నూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన గుంటూరులో నిరసన ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని ఆరోపించారు. రాజధాని నిర్మాణంలో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపించి ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 26వ తేదీన గుంటూరులో తలపెట్టిన ర్యాలీ, సభకు అసంఘటిత రంగ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు, జి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నరేంద్రకు సముచిత స్థానం ఇవ్వాలి: తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి రుక్మిణి

పెదకాకాని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో సముచిత స్థానం కల్పించాలని టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మలినేని రుక్మిణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రుక్మిణి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, నియోజకవర్గంలోని కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉండి, పార్టీని ముందుకు నడిపించిన వ్యక్తి ఎమ్మెల్యే నరేంద్ర అన్నారు. అలాంటి నరేంద్రకు సముచితస్థానం కల్పించకపోవడం కార్యకర్తలకు బాధగా ఉందన్నారు. పెదకాకాని ఎంపీటీసీ సభ్యురాలు పెండ్యాల మాధవి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎన్నో విధాలుగా దెబ్బతీసినా వాటన్నిటినీ ఎదుర్కొని నిలబడిన నాయకుడు నరేంద్ర అన్నారు. నరేంద్రకు సముచిత స్థానం ఇవ్వకుంటే ధర్నాలు, నిరసనలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు జంపని లక్ష్మి, వార్డు మెంబర్ తోట సౌజన్య, కుక్కల మహాలక్ష్మి, కొంగర అంజనాదేవి, లక్ష్మీ రాజ్యం, ఆలపాటి జ్యోతి, జొన్నలగడ్డ యశోద, మన్నవ లీల తదితరులు పాల్గొన్నారు.

రేపు బాబూజీ మహరాజ్ జయంతి

తెనాలి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ స్థాపకులు బాబూజీ మహరాజ్ 120వ జయంతి ఈ నెల 24న కొలకలూరు జోన్ ఆశ్రమంలో జరుగుతుందని కో-ఆర్డినేటర్ రామకోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. జోన్ పరిధిలోని అభ్యాసకులంతా జయప్రదం చేయాలని కోరారు.

రేపు వైఖానస సేవా సంఘ వన సమారాధన

తెనాలి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైఖానస సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన జరుగుతుందని సంఘ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస మూర్తి తెలిపారు. సుల్తానాబాద్‌లోని రామకృష్ణ మనోహర్ ఆశ్రమంలో నిర్వహించే కార్యక్రమంలో సభ్యులంతా పాల్గొనాలని కోరారు.

టిడ్కో గృహాల కోసం లబ్ధిదారుల ఎదురు చూపులు

- ఐదేళ్లుగా నిర్లక్ష్యంనీడన గృహ సముదాయాలు
- ఆఖరు ఏడాదిలో అరకొర వసతులతో పంపిణీ
- 545మంది లబ్ధిదారుల నిరీక్షణ


నిడుబ్రోలులోని టిడ్కో గృహాలు

పొన్నూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నివాస యోగ్యం కల్పించేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో గృహాల కోసం లబ్ధిదారుల ఎదురు చూపులు తప్పటం లేదు. 2016లో కేంద్ర ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడును సంప్రదించి పొన్నూరు టిడ్కో గృహాల ప్రాజెక్టును మంజూరు చేయించుకున్నారు. పట్టణంలోని నిడుబ్రోలులో ప్రభుత్వం సేకరించిన 21ఎకరాలను ఈ గృహ సముదాయాల నిర్మాణానికి మంజూరు చేయించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 57 బ్లాక్‌లో 2368 గృహాలను నిర్మించేలా ప్రాజెక్టును అమోదించి శరవేగంగా ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. పనులు మొదలుపెట్టిన రెండు సంవత్సరాల కాలంలోనే టిడ్కో గృహాల పనులు 85 శాతం పూర్తి అయ్యాయి. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో టిడ్కో గృహ సముదాయాలను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఈ గృహ సముదాయాలలో గృహాల కోసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయినప్పటికి పలు కారణాలను చూపి వైసీపీ పాలకులు గృహ సముదాయాలను పూర్తిగా పక్కన పెట్టేశారు. దీంతో దాదాపు నిర్మాణం పూర్తయిన గృహాలలో నిర్వహణ లేక శిథిల దశకు చేరుకోవటం ప్రారంభమయ్యాయి. లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం కావటంతో 2023వ సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం ఈ గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేసింది. అయితే పలు కారణాలను చూపి 160 మందిని జాబితా నుంచి తొలగించారు. మరో వంద గృహాలు ఖాళీగా ఉంచారు. అయితే వసతుల లేమితో ఈ గృహాల్లో చేరేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. తాగు నీటి ఇబ్బందులు తలెత్తి గృహాలలో చేరిన వారు సైతం తిరిగి వెళ్లిపోయారు. అయితే లబ్ధిదారుల వాటా చెల్లించగా మిగిలిన మొత్తాన్ని బ్యాంక్‌ల నుంచి రుణాలు ఇప్పించారు. లబ్ధిదారులు గృహాల్లో నివాసం ఉండకపోవటంతో ఆ వాయిదా నగదు చెల్లించేందుకు వారు ఆసక్తి చూపటంలేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులకు బ్యాంక్‌లు రుణాలు చెల్లించని కారణంగా మొండి బకాయిలుగా గుర్తించి నోటీసులు జారీ చేశాయి. 300 చ.ద.అ గృహాలు 480ఉండగా కేవలం 407మందికి మాత్రమే గృహాలు పంపిణీ చేశారు. 365 చదరపు అడుగుల గృహాలు 1648 ఉండగా 1220 మందికి గృహాలు రిజిస్టర్ కాగా 1056 గృహాలు మాత్రమే పంపిణీ జరిగింది. 430 చదరపు అడుగుల గృహాలు 240 ఉండగా 178 గృహాలు లబ్ధిదారులకు రిజిస్టర్ చేశారు. 164 గృహాలు లబ్ధిదారులకు అందచేశారు. ఈ మొత్తం ప్రాజెక్టులో లబ్ధిదారులకు ఇంకా 545 గృహాలు రిజిస్టర్ కావాల్సి ఉన్నాయి. అయితే గృహాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో రుణాలు చెల్లించకపోవటాలు కారణాలుచూపుతూ మిగిలిన గృహాలకు బ్యాంక్‌లు లింకేజ్ రుణాలు ఇవ్వటానికి ముందుకు రావటంలేదని మున్సిపల్ అధికారులు ఆరోపిస్తున్నారు. కేవలం వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఐదేళ్లపాటు లబ్ధిదారులకు గృహాలు అందచేకపోవటంతో ఆ లబ్ధిదారులు సకాలంలో రుణాలు చెల్లించలేదని అందువల్ల మిగిలిన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని గృహ యజమానుల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది. కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల రుణ సమస్యను పరిష్కరించి మిగిలిన లబ్ధిదారులకు గృహాలు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వసతుల కల్పనను కూడా పూర్తి చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్యులు సేవాగుణంతో పనిచేయాలి

● సీడీసీ జాతీయ డిప్యూటీ డైరెక్టర్ లారీ ఫుల్లర్


జిల్లా ప్రభుత్వ వైద్యశాల పరిశీలనలో సీడీసీ జాతీయ డిప్యూటీ డైరెక్టర్ లారీ ఫుల్లర్, బృందసభ్యులు

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సేవా గుణంతో పనిచేయాలని సీడీసీ జాతీయ డిప్యూటీ డైరెక్టర్ లారీ ఫుల్లర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలను సెంటర్స్ ఫర్ డీసీజ్ కంట్రోల్ (సీడీసీ) బృందం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితుల కోసం ప్రత్యేకంగా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను పరిశీలించారు. గత ఏడాది డిసెంబరులో ప్రారంభించిన క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న పరికరాలను వాటి ద్వారా చేస్తున్న పరీక్షల వివరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. తెనాలి సెంటర్లో 2143మంది హెచ్ఐవీతో బాధపడుతున్న మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం జరిగిందని అందులో ఇద్దరికి క్యాన్సర్ బారిన పడినట్లు తేలిందని మరో ఇద్దరు క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్నట్లు ఈ పరీక్షల ద్వారా తెలుసుకున్నట్లు సీడీసీ టీం సభ్యులకు మెడికల్ ఆఫీసర్లు తెలిపారు. అనంతరం వైద్యశాలలో పలు విభాగాల్లో అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. సెంటర్ పనితీరుని బృందసభ్యులు అభినందించారు. సీడీసీ జాతీయ ల్యాబ్ అడ్వైజర్ డాక్టర్ సంజీవ్ వర్మ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, లోకేష్, మహేష్‌కుమార్, డాక్టర్ మహాలింగం బృందసభ్యులుగా ఉన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహ, డాక్టర్ హరిణి ఉన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ.. కేసులు నమోదు



తెనాలి మారీసుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిస్థల వివాదంలో చోటు చేసుకున్న ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక యడ్ల లింగయ్య కాలనీ చెందిన ఎస్ చినరాంబాబు, జి రాజేష్‌లు పక్కపక్క స్థలాలలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఒకరి హద్దులోకి మరొకరు వస్తున్నారంటూ ఒకరిపై ఒకరు పరస్పరం వాదనకు దిగారు. శుక్రవారం ఒకరిపైఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ ఇద్దరు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

వెండి వ్యాపారిపై దాడి

తెనాలి, క్రైమ్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీబీ రోడ్డులో వెండి వ్యాపారం నిర్వహించే షేక్ బాజీబాబుపై గతంలో అదే షాపులో పనిచేసిన మస్తాన్ అనే యువకుడు దాడిచేసి గాయపర్చి పరారు అయ్యాడు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

తెనాలి, క్రైమ్ 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - ఒంగోలు రైలు మార్గంలోని దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జి.వెంకటాద్రి శుక్రవారం తెలిపారు. మహిళకు సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని, దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం కేరళ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలికి సంబంధించిన ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదని కేసు నమోదు చేసు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కిటికీ అద్దంపడి బాలుడికి గాయాలు

తెనాలి, అర్బన్ 22 (ఆంధ్రజ్యోతి): కిటికీ అద్దం ఊడిపడి బాలుడు గాయపడిన సంఘటన శుక్రవారం తెనాలిలో జరిగింది. పట్టణంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో పాఠశాల సమయం అనంతరం ఆవరణలో ఉన్న తన సైకిల్‌ను తీసుకోవటానికి వెళ్ళాడు. అదే సమయంలో గాలివీయడంతో స్కూల్ భవనం కిటికి గోడకు కొట్టుకుని అద్దం కింద పడింది. అక్కడే ఉన్న విద్యార్థి తలపై పడటంతో గాయపడ్డాడు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

జాతీయ స్థాయి పోటీలకు నారాకోడూరు విద్యార్థులు


జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన నారాకోడూరు విద్యార్థులు

చేబ్రోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నారాకోడూరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ఏడుకొండలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ అక్టోబరు 26వ తేదీన తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. ఈ జట్టులో అత్యుత్తమ ప్రతిభ చూపిన నారాకోడూరు పాఠశాలకు చెందిన విద్యార్థులు వి.హరీష్, వై.అనీల్, పి.కార్తీక్‌లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ క్రీడాకారులు ఈ నెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఛతీస్‌గడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వల్లభాపురంలో వైద్య శిబిరం

కొల్లిపర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధులకు వైద్యుల సలహాలు, సూచనలు మేరకు మందులు వాడుకోవాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్ఎం శ్యామ్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు కృష్ణకుమారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి హోటల్స్ అసోసియేషన్ సభ్యుల విరాళం రూ.25 లక్షలు


సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కును అందిస్తున్న హోటల్స్ అసోసియేషన్ నాయకులు

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి హోటల్స్ అసోసియేషన్ తరుపున రూ.25లక్షల విరాళ చెక్కును అందించారు. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడుల చేతుల మీదుగా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి, కార్యదర్శి ఎం. నాగరాజు. కోశాధికారి ఈదర వెంకటపూర్ణచంద్, సెక్రటరీ రఘువీర్, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వీరిని సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు.

జియో ట్యాగింగ్ సర్వేలలో అలసత్వం వద్దు

● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి మారీసుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్ సర్వేలలో అలసత్వం వద్దని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. స్థానిక గంగానమ్మపేట భువనం వారి వీధిలో సచివాలయ పరిధిలో జరుగుతున్న జియో ట్యాగింగ్ సర్వేను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేలో నమోదు శాతం తక్కువగా ఉండంతో ఆకస్మిక తనిఖీ నిర్వహిచామన్నారు. సర్వే నమోదులో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు చర్యలు


వెల్లలూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయటానికి చర్యలు తీసుకుంటునట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు, మండల పరిధిలోని వెల్లలూరు, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో రైతు సేవా కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. వరి కోత కోసే ప్రతి రైతుకు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న సౌకర్యాలు నాణ్యతా ప్రమాణాలు గిట్టుబాటు ధర గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు పండించిన ధాన్యంను విక్రయించినటానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులు 7337359375 నంబరుకు వాట్సప్ చేసి హాయ్ అని మెజేస్ చేస్తే ఏ కేంద్రంలో ఏ రోజు ఏ సమయంలో ఏ రకం ధాన్యం అమ్మదల్చుకునారో మెసేజ్ చేస్తే స్లాట్ బుక్కింగ్ అయే విధానాన్ని అమలు చేయనునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో దేగల వెంకట రామయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు నిధుల కేటాయింపుపై హర్షం

పొన్నూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించటం హర్షణీయం అని మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో 75మంది పశు పోషకులకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మినీ గోకులాలను మంజూరు చేసినట్లు చెప్పారు. రూ.1.66 కోట్లు వ్యయంతో ఈ మినీ గోకులాలను నిర్మిస్తునట్లు చెప్పారు. మరో 10మినీ గోకులాలు త్వరలోనే మంజూరు చేయనునట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా ధ్వంసమైతే పట్టించుకోలేదని ఆరోపించారు. వీటి మరమ్మతులకు రూ.1.38కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. గుంటూరు-చీరాల రోడ్డుకు రూ.20లక్షలు, జీబీసీ రోడ్డు నుంచి బ్రాహ్మణకోడూరు మీదుగా జూపూడి వెళ్లే రహదారికి రూ.10లక్షలు, పొన్నూరు నుంచి పాంఢ్రపాడు రోడ్డుకు రూ.5లక్షలు, నిడుబ్రోలు- గోవాడ రోడ్డుకు రూ.9 లక్షలు, జూపూడి-బ్రాహ్మణకోడూరు గ్రామాల్లో కల్వర్టుల నిర్మాణానికి రూ.35లక్షలు, రిటైనింగ్ వాల్‌కు రూ.45లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు.

డ్రోన్ల సాయంతో దోమల నివారణ చర్యలు

పొన్నూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల సాయంతో దోమల నివారణ చర్యలకు శ్రీకారం చుట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు డీఆర్‌కే కాలనీలో శుక్రవారం డ్రోన్ల ద్వారా యాంటీ లార్వా మందుల పిచికారిని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని నిడుబ్రోలు ప్రాంతంతో పాటు పలు ప్రాంతాలలో నివాసన గృహాల మధ్య, చెరువులు, కాల్వలు ఉన్నందున దోమల నివారణ చర్యలు చేపట్టం కష్టతరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయితే పట్టణమంతా అమలు చేయనునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాలకు కొరత లేదు

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో మొక్కజొన్న విత్తనాలకు కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లాలోని విత్తనాల డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూజివీడు, పయనీర్, కావేరి, అడ్వెంట, మహికో, కార్నటెక్, బేయర్, శ్రీరామ, భారతి, ఎషియన్, అగ్రీ జెనెటిక్స్ , బయో సీడ్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీల వద్ద నున్న మొక్కజొన్న విత్తనాల నిల్వలపై జిల్లా వ్యవసాయ అధికారి సమీక్షించారు. అనంతరం నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రబీలో 25 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేసే అవకాశం ఉందని అన్నారు. అందుకుగాను ఐదు వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, డీలర్స్ వద్ద తొమ్మిది వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. జొన్న 20 వేల హెక్టార్లలో సాగు చేసే అవకాశం ఉందని అందుకు గాను రెండు వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, మూడు వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. మొక్కజొన్న విత్తనాలు సీడ్ ట్రీట్మెంట్ చేసి ప్రముఖ కంపెనీలు రైతులకు అందుబాటులో ఉంచాయని వెల్లడించారు. రైతులు తప్పక లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా పూర్తి వివరాలతో బిల్లు తీసుకొని భద్ర పరచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.

చలికాలంలో పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి

● మండల పశువైద్యాధికారి సాయిసతీష్‌రాజు





కొల్లిపర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చలికాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కొక్కసారి పశువులు కూడా చనిపోయే ప్రమాదం ఉందని మండల వైద్యాధికారి సరికొండ సాయిసతీష్‌రాజు పేర్కొన్నారు. ఆయనతో ఆంధ్రజ్యోతితో శుక్రవారం పలు అంశాలపై మాట్లాడిన వివరాలు..

ప్రశ్న: చలికాలం పశువులకు ఎక్కువగా ఏ విధమైన వ్యాధులు వస్తాయి?

జవాబు: శ్వాసకోశ, చర్మవ్యాధులు, గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: పశువులకు వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: రైతులు పశువులను ప్రతిరోజు గమనిస్తూ ఉండాలి. రాత్రి సమయాల్లో ఆరు బయట కట్టివేయడం మంచిది కాదు. దోమలు, చుండిఈగలు వంటి కీటకాలు నుంచి వాటికి రక్షణ కల్పించాలి. పశువుల పాకలు చుట్టూ దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలి. పశువుల పాకలో నెమ్ము లేకుండా చూచుకోవాలి.

ప్రశ్న: గాలికుంటు వ్యాధి లక్షణాలు ఎలా ఉన్నాయి?

జ: గాలికుంటు వ్యాధి వచ్చినపుడు పశువుకు తరుచూ జ్వరం రావటం, పాలది గుబడి కూడా తగ్గిపోతోంది. పశువు ఒక్కొక్కసారి చనిపోయే ప్రమాదం ఉంది. పశువైద్యాధికారి సలహా మేరకు మందులు వాడాలి.

ప్రశ్న: చలికాలంలో దూడలు చనిపోవటానికి కారణం ఏమిటి ?

జ: దూడలకు శరీర ఉష్ణోగ్రత తగ్గిపోవడంతో పాటు నిమోనియా వంటి వ్యాధులు రావటంతో చనిపోతున్నాయి.

ప్రశ్న: ఈ వ్యాధులను అరికట్టడానికి క్యాంపులు నిర్వహిస్తున్నారా ?

జ: ప్రతి నెల మండల గ్రామాల్లో పలు చోట్ల క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాము.

ప్రశ్న: పశుసమర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు ఏమిటి ?

జ: ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ ద్వారా మినీ గోకులం షెడ్డులకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. ఇప్పటికే షెడ్డుల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి.

ప్రశ్న: మండలంలో మినీగోకులం షెడ్డులు ఎన్ని మంజూరు అయ్యాయి ?

జ: 25 షెడ్డులు మంజూరయ్యాయి. అవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.

మొక్కే కదా అని వదిలేస్తే...



తెనాలి-పెదరావూరు మార్గంలో నాలుగు లైన్ల రహదారి కోసం నిర్మించిన రిటైనింగ్ వాల్స్‌లో రావి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. కృష్ణా పశ్చిమ డివిజన్, తూర్పు, నిజాంపట్నం కాల్వలకు రెండు వైపులా గోడలు నిర్మించి రోడ్డు వేశారు. ఈ గోడల్లో పేరుకున్న మట్టిలో రావి మొక్కలు పెరుగుతూ ఉన్నాయి. మాను కాకముందే మొక్కగా ఉన్నప్పుడే తొలగిస్తే గోడకు ముప్పు తప్పుతుందని పలువురు సూచిస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. **- తెనాలి అర్బన్, ఆంధ్రజ్యోతి**


సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న మంత్రి మనోహర్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అందులో భాగంగానే ఖరీదైన వైద్యసేవలను సైతం పేదలు పొందేలా సీఎం సహాయనిధి నుంచి వైద్యఖర్చులకు ఆర్థిక సాయం అందించి ఆయా కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శుక్రవారం అమరావతి వెలగపూడి సచివాలయంలో తెనాలి నియోజవర్గానికి చెందిన ఏడుగురికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.13,40,418 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి మనోహర్ అందించారు. పలువురు బాధితుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.